Follow: @ANNTELUGU

26-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 259 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఒకే యాప్‌లో 25 రకాల సేవలు జూ వన్ యాప్ ప్రారంభం

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి ఇంద్రజ, ఏఎన్ఎన్- మహాపత్రిక సీఈవో కంది రామచంద్రారెడ్డి
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో సేవలు ప్రారంభం

**హైదరాబాద్, మహా :** రోజువారీ అవసరాల కోసం వేర్వేరు యాప్‌లను ఆశ్రయించే పరిస్థితికి ప్రత్యామ్నాయంగా, అనేక రకాల సేవలను ఒకే డిజిటల్ వేదికపై అందించే లక్ష్యంతో రూపొందించిన 'జుఒన్' సూపర్ యాప్ ప్రారంభమైంది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని పీర్లెస్ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి ఇంద్రజ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ వ్యవస్థాపకులు, సీఈవో కంది రామచంద్రారెడ్డి, జబర్దస్త్ ఆర్టిస్టులు, యాప్ బ్రాండ్ అంబాసిడర్ రాధిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జుఒన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. 'వన్ యాప్.. మెనీ సొల్యూషన్స్' అనే నినాదంతో ముందుకొచ్చిన

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

## ముంబైకు సీఎం రేవంత్ రెడ్డి ఫడ్నవీస్ తో కీలక చర్చలు



02

## సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' పేరిట ఢిల్లీలో మెగా ర్యాలీ

- ఉచిత ప్రచారం కల్పిస్తున్న బీజేపీకి థ్యాంక్స్
- రాహుల్ గాంధీ



03

## ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు ప్రధాని మోదీ



03



## 'రామాయణ' ప్రభంజనం

**కళ్లు చెదిరేలా అడ్వాన్స్ బుకింగ్స్**

**మహా :** రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన 'రామాయణ' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో యష్ రావణుడిగా కనిపించనున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ఇప్పటికే 137 నగరాలు, పట్టణాల్లో 4,339 షోలకు సంబంధించి 1.81 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. వీటి ద్వారా రూ.10 కోట్లకు పైగా వసూళ్లు వచ్చినట్లు సమాచారం. మిగతా 3వ పేజీలో



## కర్ణాటకలో కన్నడులకే

- ఉద్యోగాలు నిరాకరిస్తే చర్యలు తప్పవు
- ఐటీ సంస్థలకు డీకే శివకుమార్ హెచ్చరిక

**బెంగళూరు, మహా :** బెంగళూరులోని కొన్ని విద్యాసంస్థలు, ప్రైవేటు ఐటీ కంపెనీలు కన్నడిగులకు ఉద్యోగావకాశాలు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నాయనే ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. 'కర్ణాటకలో కన్నడిగుడే సార్వభౌముడు' అని ఆయన స్పష్టం చేస్తూ, కన్నడ భాష మాట్లాడే వారికి ఉద్దేశపూర్వకంగా ఉద్యోగాలు నిరాకరిస్తే ప్రైవేటు మిగతా 3వ పేజీలో




## ఉత్కంఠ రేపుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు

- 9,829 ఎంపీటీసీ, 659 జెడ్పీటీసీ స్థానాలకు పోటాపోటీ!
- అక్టోబర్ 27న ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు.
- నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడి!

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలక దశకు చేరుకుంది. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక మిగతా 3వ పేజీలో






# మిర్చి డెవలపర్స్ బరితెగింపు..!

నార్సింగి సర్కిల్ ఖానాపూర్‌లో మిర్చి డెవలపర్స్ గేటెడ్ కమ్యూనిటీ పేరుతో రియల్ మాఫియా బరితెగింపుకు పాల్పడింది.. జీవో 111ను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి అక్రమ విల్లాల నిర్మాణాలు సాగిస్తూ అధికార యంత్రాంగానికే సవాల్ విసిరింది.. జంట జలాశయాల పరిరక్షణ కోసం ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీవో 111ను అపహాస్యం చేస్తూ.. నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకపోయినా, ఏకంగా 28 విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి కోట్లాది రూపాయల దందాకు తెగబడింది.. ఒక్కో విల్లా ధర మార్కెట్లో రూ.3 నుంచి 5 కోట్ల పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.. ఈ వ్యవహారమంతా చైన్‌మెన్ సాయిరెడ్డి కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు, అక్రమ నిర్మాణదారుల నుండి భారీగా వసూళ్లకు తెగబడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు ఇంతలా బరితెగిస్తున్నా డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా వైఫల్యం చెందడంతో, నార్సింగి సర్కిల్‌లో పాలన పడకేసిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి .. సీఎంసీ కమిషనర్ 'వన్ డే.. వన్ డివిజన్' పేరుతో కాలయాపన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప, కళ్లెదుటే జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఖానాపూర్‌లో ఖతర్నాక్ విల్లాలు..!

- జీవో 111ను తుంగలో తొక్కి యథేచ్ఛగా నిర్మాణాలు..!
- 28 విల్లాలకు శ్రీకారం చుట్టిన బిల్డర్లు ..!
- ఒక్కో విల్లా ధర రూ.3 నుంచి 5 కోట్ల పైమాటే..!
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమార్కులు..!
- జంట జలాశయాల పరిరక్షణకు తూట్లు..!
- అంతా చైన్‌మెన్ సాయిరెడ్డి కనుసన్నల్లోనే..!
- భారీగా అక్రమ వసూళ్లకు తెగబడుతున్నట్లు ఆరోపణలు..!
- నార్సింగి సర్కిల్ లో పడకేసిన పాలన...!
- 'వన్ డే.. వన్ డివిజన్' పేరుతో కాలయాపన చేస్తున్న సీఎంసీ కమిషనర్..!

02






## జోడిమెట్లలో ఆగని అక్రమ షెడ్లు...!

- నోటీసులకే పరిమితమైన టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు...!
- శరవేగంగా కొనసాగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణ పనులు..!
- ప్రారంభానికి సిద్ధమవుతున్న షెడ్లు.. చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం..!
- తూతూమంత్రంగా కూల్చివేతలు...!
- ఏటీఆర్ జారీ చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు...!
- కూల్చిన చోటే మళ్ళీ యదేచ్ఛగా నిర్మాణాలు...!
- డమ్మీగా మారిన ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్...!
- స్పెషల్ టాస్క్ ఫోర్స్ జాడెక్కడ...!
- జోనల్ కమిషనర్, ఎంఎంసీ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు..!

02




## అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం ..! బిల్డర్ల అరాచకం..!

- సీఎంసీ సాక్షిగా అంతులేని అక్రమ నిర్మాణాలు..!
- అయ్యప్ప సొసైటీలో అవినీతి అనకొండలు..!
- బ్యూరోక్రాట్ల అడ్డాగా మారిన అయ్యప్ప సొసైటీ..!
- జీరో పర్మిషన్లతో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు..!
- హోటళ్లు, కాలేజీలు, కో-లివింగ్ హాస్టళ్లు, వ్యాపార సముదాయాల కోసం నిబంధనలను బొందపెట్టి బహుళ అంతస్తుల నిర్మాణాలు..!
- సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ మచ్చుకైనా కనిపించని వైనం..!
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా నిర్మాణాలు..!
- అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులేనా..?
- ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, అటువైపు కన్నెత్తి చూడాలంటే వణుకు..!
- అక్రమ నిర్మాణాలను ఉపేక్షించమంటూ సీఎంసీ కమిషనర్ కళ్లబొల్లి కబుర్లు..!
- క్షేత్రస్థాయి ఆచరణలో అంతా డొల్లే..!
- క్యూర్ చట్టం ఎవరికి చుట్టం...! ● పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలు...!
- అయ్యప్ప సొసైటీకి వెళ్లేందుకే సాహసించని సీఎంసీ, హైడ్రా కమిషనర్లు..!

02



### ఇప్పటికైనా మేల్కొంటారా..? – సమగ్ర సర్వే జరగాలి!

అయ్యప్ప సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. భవనాల నిర్మాణ అనుమతులు, సెట్ బ్యాక్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లపై సీఎంసీ, హైడ్రా, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయిన భవనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఆరోపణలతో పాటు, అధికారులపై వినిపిస్తున్న వసూళ్ల ఆరోపణలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో హైడ్రా చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొంటున్న స్థానికులు, అయ్యప్ప సొసైటీలోనూ సీఎంసీతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంజయ్యనగర్ తరహా ఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే ప్రమాదాలను నివారించడమే ముఖ్యమని వారు స్పష్టం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి, ఫైర్ సేఫ్టీ లోపాలను సరిచేయించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, అయ్యప్ప సొసైటీలో సమగ్ర తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



# మిర్చి డెవలపర్స్ బరితెగింపు..!







**మహా, సిటీ బ్యూరో:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి సర్కిల్, ఖానాపూర్ లో రియల్ మాఫియా బరితెగింపునకు హద్దూ అదుపూ లేకుండా పోతోంది. పర్యావరణ పరిరక్షణ చట్టాలను, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, అధికార యంత్రాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కొందరు బిల్డర్లు కోట్ల రూపాయల అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి మణిహారాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల ఉనికిని కాపాడేందుకు ఉద్దేశించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన 'జీవో 111' ఆంక్షలను 'మిర్చి డెవలపర్స్' సంస్థ అపహాస్యం పాలు చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . ఖానాపూర్ పరిధిలో ఎలాంటి పర్యావరణ, మున్సిపల్ అనుమతులు లేకుండానే యథేచ్ఛగా భారీ కాంక్రీట్ నిర్మాణాలకు తెరలేపి, పచ్చని ప్రకృతిని, క్యాచ్‌మెంట్ ఏరియాలను నిలువునా ధ్వంసం చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు. ఏకంగా 28 ఖతర్నాక్ విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, కోట్లాది రూపాయల ధనార్జనే ధ్యేయంగా అక్రమ దందాకు తెగబడ్డారని స్థానికంగా బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కోట్లలో వ్యాపారం.. ప్రభుత్వ ఖజానాకు భారీ గండి..!**

జీవో 111 పరిధిలోని భూముల్లో ఎలాంటి భారీ లేఅవుట్లకు, బహుళ అంతస్తుల భవనాలకు చట్టబద్ధంగా అనుమతులు లభించవని జి ఓ స్పష్టం చేస్తోంది. కానీ, ఈ నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కిన మిర్చి డెవలపర్స్.. అక్కడ విలాసవంతమైన విల్లాల సామ్రాజ్యాన్ని సృష్టిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా ఇక్కడ నిర్మిస్తున్న ఒక్కో విల్లా మార్కెట్ ధర రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్ల పైమాటే పలుకుతుందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నాలా కన్వర్షన్ ఫీజులు, బిల్డింగ్ పర్మిషన్ ఫీజులు, లేఅవుట్ ఛార్జీలు, ఇతర పన్నులను పూర్తిగా ఎగ్గొట్టడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి ఈ అక్రమార్కులు భారీగా గండి కొడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఖజానాను బారీగా గండి కొడుతూ, కేటుగాళ్ళు సాగిస్తున్న కోట్లాది రూపాయల దందాపై స్థానికులు మండి పడుతున్నారు.

**అంతా 'చైన్‌మెన్' సాయిరెడ్డి కనుసన్నల్లోనే ..!**

నార్సింగి సర్కిల్‌కు చెందిన 'చైన్‌మెన్ సాయిరెడ్డి' కనుసన్నల్లోనే ఈ అక్రమ సామ్రాజ్యం మొత్తం నడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులను, బిల్డర్లను సమన్వయం చేస్తూ సాయిరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తున్నారని స్థానికులు గుసగుసలాడుతున్నారు. విల్లాల నిర్మాణాలకు అడ్డంకులు రాకుండా చూసేందుకు, నిర్మాణ పనులను సజావుగా సాగించేందుకు సాయిరెడ్డి భారీగా అక్రమ వసూళ్లకు తెగబడుతున్నట్లు, సర్కిల్ లో జరుగుతున్న అన్నీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినా ఆయనే కొండంత అభయం ఇస్తుండటంతో బిల్డర్లు మరింత బరితెగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నార్సింగి సర్కిల్ లో పడకేసిన పాలన.. సీఎంసీ కమిషనర్ 'కాలయాపన'!**

నార్సింగి మున్సిపల్ సర్కిల్‌లో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా పడకేసిందనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యంగా చెప్పవచ్చును. కళ్లెదుటే జంట జలాశయాల మనుగడకు ముప్పు వాటిల్లుతున్నా, నిబంధనలను ఉల్లంఘించి యదేచ్చగా విల్లాలు లేపుతున్నా నార్సింగి డిప్యూటీ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలను పర్యవేక్షించి, వాటిని ప్రాథమిక దశలోనే నిలిపివేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లఇకపోతే, ఈ అక్రమనిర్మాణాలను ఆదిలోనే ఉక్కుపాదంతో అణచివేయాల్సిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) కమిషనర్ డాక్టర్. జి. సృజన సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం పబ్లిసిటీ స్టంట్లకే పరిమితమై, 'వన్ డే.. వన్ డివిజన్' అనే ప్రచార కార్యక్రమాల పేరుతో కాలయాపన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న అసలు రహస్యమేంటోనని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను తుంగలో తొక్కుతూ జంట జలాశయాల ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్న మిర్చి డెవలపర్స్‌పై, ఈ వ్యవహారంలో తెరవెనుక సూత్రధారిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న చైన్‌మెన్ సాయిరెడ్డిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు , పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. జీవో 111 నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాల చట్టబద్ధతను సమగ్రంగా పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నట్లు తేలితే 28 విల్లాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలనివారు కోరుతున్నారు. జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 111 లక్ష్యం దెబ్బతినకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు సంబంధిత అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు, పర్యావరణవేత్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



అశోక్ లేలాండ్ షోరూం ఎదురుగా ప్రారంభానికి సిద్ధమైన భారీ షెడ్డు

# జోడిమెట్లలో ఆగని అక్రమ షెడ్లు...!







**ఘట్కేసర్, అక్టోబర్ 26 (మహా):** మేడ్చల్ -మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్కేసర్ సర్కిల్, పోచారం వార్డ్, జోడిమెట్ల పరిధిలోని నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రెండు భారీ అక్రమ షెడ్ల వ్యవహారంలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . "నోటీసులిచ్చాం.. చర్యలు తీసుకుంటాం" అని అధికారులు పేర్కొంటున్న మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప, అక్రమ షెడ్ల నిర్మాణ పనులను నిలిపివేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నామమాత్రపు నోటీసుల నాటకమాడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా 'జీరో పర్మిషన్'తో కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.ఇలాంటి భారీ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్/బిల్డింగ్ అనుమతులు, హెచ్ఎండీఏ అనుమతులు, భూమి వినియోగానికి సంబంధించిన అనుమతులు, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్, అవసరమైన పర్యావరణ అనుమతులు, నీటి-మురుగునీటి నిర్వహణకు సంబంధించిన అనుమతులు తదితరాలు అవసరమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే సంబంధిత అనుమతుల వివరాలు బహిర్గతం కాకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి .

నిర్మాణ ప్రదేశాల్లో ప్రాజెక్టు వివరాలు, అనుమతి నంబర్లు, నిర్మాణ సంస్థ వివరాలతో కూడిన సమాచార బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో పనులు సాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం...?**

సాధారణంగా సామాన్యులు చిన్నపాటి ఇల్లు కట్టుకుంటేనే అనుమతుల పేరుతో హడావుడి చేస్తూ చుట్టూ తిరిగే టౌన్ ప్లానింగ్ అధికారులు.. కళ్లెదుటే ఇంత పెద్ద భారీ షెడ్లు వాణిజ్య నిర్మాణం కొనసాగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అసలు రహస్యం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణదారుల నుంచి భారీగా ముడుపులు ముట్టడం వల్లే అధికారులు కేవలం నామమాత్రపు నోటీసులిచ్చి కాలం వెళ్లదీస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రభుత్వానికి ల్యాండ్ కన్వర్షన్, బిల్డింగ్ పర్మిషన్స్ రూపంలో రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రెండు నోటీసులిచ్చాం.. కూలుస్తాం.. ఇదేనా చర్యలు..!**

ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై చర్యల గురించి సంబంధిత అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపి) శ్రీధర్ ను వివరణ కోరగా, ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగుతుండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు జారీ చేసినట్లు చెప్పడమే తప్ప, నిర్మాణ పనులు నిలిపివేసేందుకు తీసుకున్న చర్యలేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల నియంత్రణలో టౌన్ ప్లానింగ్ విభాగం బాధ్యత కీలకం. నిర్మాణానికి అవసరమైన అనుమతులను పరిశీలించడం, ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, అవసరమైనప్పుడు పనులు నిలిపివేయించడం అధికారుల విధుల్లో భాగం. అయితే జోడిమెట్ల లో భారీ షెడ్ల వ్యవహారంలో నోటీసుల జారీ గురించి చెబుతున్నప్పటికీ, నిర్మాణం ఎందుకు కొనసాగుతోందన్న ప్రశ్నకు స్పష్టత రావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రెండు నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు ఆగకపోతే తదుపరి చర్యలు ఏమిటి? కూల్చివేత ఎప్పుడు చేపడతారు? అన్న అంశాలపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**ప్రభుత్వ ఖజానాకు భారీ గండి..తక్షణమే విచారణ చేపట్టాలి**

అనుమతులు లేకుండా భారీ నిర్మాణాలు కొనసాగితే ప్రభుత్వానికి రావాల్సిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, నాలా కన్వర్షన్ ఫీజులు తదితర ఆదాయాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కోట్లాది రూపాయల విలువైన నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ల్యాండ్ యూజ్, నిర్మాణ విస్తీర్ణం, ఫీజుల చెల్లింపుల వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

**తూతూమంత్రంగా కూల్చివేతలు..!**

ఇదిలా ఉండగా, జోడిమెట్ల పరిధిలోని తాజా కిచెన్ ఎదురుగా కొనసాగుతున్న ఓ అక్రమ నిర్మాణంపై గతంలో మహా పత్రికలో వార్తా కథనం వెలువడిన అనంతరం ఘట్కేసర్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి కూల్చివేతలు చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే నిర్మాణాన్ని పూర్తిగా తొలగించకుండా కేవలం కొంత భాగాన్ని మాత్రమే కూల్చివేయడంతో ఆ చర్యలు నామమాత్రంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులు కూల్చివేతలు చేపట్టిన మరుసటి రోజే అదే ప్రదేశంలో తిరిగి నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కూల్చివేత జరిగిన చోటే పనులు పునఃప్రారంభం కావడం అధికారుల చర్యలపై పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు. కఠిన చర్యలు లేకపోవడం వల్లే అక్రమార్కులు తిరిగి పనులు ప్రారంభించే పరిస్థితి ఏర్పడిందని ఆక్షేపిస్తున్నారు.

**ఏటీఆర్ కోసమే కూల్చివేతల డ్రామా..?**

ఉన్నతాధికారులకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పించేందుకే హడావుడిగా కూల్చివేతలు నిర్వహించి, అనంతరం చర్యలను నిలిపివేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**జోనల్ కమిషనర్, ఎంఎంసీ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు..!**

ఘట్కేసర్ సర్కిల్ జోడిమెట్ల పరిధిలో నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనసాగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణాలపై ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధికా గుప్తా, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. తాజా కిచెన్ ఎదురుగా, అశోక్ లేలాండ్ షోరూం ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే కొనసాగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అక్రమంగా కొనసాగుతున్న షెడ్ల నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి, అవసరమైన చోట్ల సీజ్ చేయడంతోపాటు నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అవసరమైతే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపించి, నిబంధనల ఉల్లంఘనలను నిర్ధారించి, తక్షణమే ఈ అక్రమ షెడ్లను కూల్చివేయడంతో పాటు, అక్రమ షెడ్డును పూర్తిగా సీజ్ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఈ భారీ అక్రమ షెడ్డు నిర్మాణంపై ఉప్పల్ జోనల్ కమిషనర్, ఎంఎంసీ కమిషనర్ ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? నోటీసులకే పరిమితమైన టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుకు ఎప్పుడు ముగింపు పలుకుతారు? అనేది వేచి చూడాల్సిందే.

# అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం ..!

# బిల్డర్ల అరాచకం..!



అయ్యప్ప సొసైటీ రోడ్ నెంబర్ 40 లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

**హైదరాబాద్, మహా :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్‌పల్లి జోనల్, మాదాపూర్ సర్కిల్ 50 పరిధిలో ఉన్న అయ్యప్ప సొసైటీలో బిల్డర్ల అరాచకం రాజ్యమేలుతోంది. ప్రపంచస్థాయి ఐటీ రంగం , వేల కోట్ల పెట్టుబడులతో విస్తరిస్తున్న ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, సీఎంసీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని చూస్తే.. ఇది నివాస ప్రాంతమా లేక రియల్ మాఫియా అండర్‌వరల్డ్ సామ్రాజ్యమా అన్న అనుమానాలు వ్యక్తమవక మానవు. అడవిలో చెట్లు పెరిగినట్టు.. చీమలు దూరని చిట్టడవిలా, కాకులు దూరని కారడవిలా ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. ఒక భవనం మీద మరో భవనం నిర్మిస్తూ.. ఎలాంటి అనుమతులు లేకుండా, సెట్ బ్యాక్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘిస్తూ నోటరీ స్థలాలను సైతం వదలకుండా సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి వేల కోట్ల రూపాయల గండి పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. 100 నుంచి 200 గజాల స్థలాల్లోనే కాకుండా 200 నుంచి 1,000 గజాల వరకు ఉన్న స్థలాల్లోనూ సెల్లార్, స్టిల్ట్‌తో పాటు గ్రౌండ్ నుంచి ఏడు, ఎనిమిది అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని భవనాలను కోలివింగ్ హాస్టళ్లు, ప్రైవేట్ హాస్టళ్లు, హోటళ్లు, పబ్‌లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలుగా వినియోగిస్తున్నారని, ఇంతటి స్థాయిలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*అంగుళం ఖాళీ లేని నిర్మాణాలు.. సెట్ బ్యాక్‌లు ఎక్కడ?

భవన నిర్మాణ నిబంధనల ప్రకారం స్థలం విస్తీర్ణం, భవనం ఎత్తు, వినియోగం తదితర అంశాలను బట్టి అవసరమైన సెట్ బ్యాక్‌లు, ప్రవేశ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు ఉండాలి. గాలి, వెలుతురు, నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు వీలుగా భవనాల చుట్టూ తగినంత ఖాళీ ప్రదేశం ఉండటం కీలకం.అయితే, అయ్యప్ప సొసైటీలోని కొన్ని నిర్మాణాల్లో భవనాల మధ్య కనీస ఖాళీ కూడా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక భవనానికి మరో భవనం ఆనుకుని ఉండటంతో గాలి, వెలుతురు సరిగా ఉండని పరిస్థితులు నెలకొంటున్నాయని, ఒక భవనం కిటికీ తెరిస్తే పక్క భవనం గోడ తాకేలా, అసలు వెంటిలేషన్ అనేదే లేకుండా దిగ్బంధనంలా నిర్మాణాలు చేపడుతున్నారని వారు పేర్కొంటున్నారు.

ఫైర్ సేఫ్టీ శూన్యం.. అగ్నిప్రమాదాలు జరిగితే అంతే సంగతులు !

అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాల్లో ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక భద్రత) ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని కోలివింగ్ హాస్టళ్లు, ప్రైవేట్ హాస్టళ్లు, విద్యాసంస్థలు, హోటళ్లలో ఒకేసారి వందలాది మంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు నివసిస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు లేకపోవడం వల్ల ఏమాత్రం అగ్నిప్రమాదం సంభవించినా ప్రమాద తీవ్రత పెరిగి అపార ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

అగ్నిప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజిన్లు భవనాల వద్దకు చేరుకోగలవా? అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉన్నాయా? అగ్నిమాపక పరికరాలు పనిచేస్తున్నాయా? భవనాల సామర్థ్యానికి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖలు సమాధానం చెప్పాల్సి ఉందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే తనిఖీలు నిర్వహించి ప్రమాదకర పరిస్థితులను సరిదిద్దడం అవసరమని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

372 అక్రమ నిర్మాణాలు గుర్తించినట్లు ప్రకటన.. మరి అయ్యప్ప సొసైటీ సంగతేంటి*?

సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన గతంలో 372 అక్రమ నిర్మాణాలను గుర్తించినట్లు, రోజుకు రెండు నిర్మాణాల చొప్పున కూల్చివేతలు చేపడుతున్నట్లు వెల్లడించిన నేపథ్యంలో.. అయ్యప్ప సొసైటీలోని నిర్మాణాలపై అధికారుల వైఖరి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక్కడి భవనాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారా? అనుమతుల వివరాలను తనిఖీ చేశారా? నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించారా? గుర్తించినట్లయితే తీసుకున్న చర్యలేమిటి? అన్న విషయాలపై సీఎంసీ కమిషనర్ స్పష్టత ఇవ్వాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు.

సీయూఆర్ఈ (క్యూర్) చట్టం ఎవరికి చుట్టం ?

కోర్ అర్బన్ రీజియన్ఎకానమీ (సీయూఆర్ఈ) పరిధిలో మున్సిపల్ పాలనను సమన్వయం చేయడం, అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టడం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం వంటి లక్ష్యాలతో కొత్త చట్టపరమైన వ్యవస్థ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. అయ్యప్ప సొసైటీ వంటి ప్రాంతాల్లో దాని అమలు ఎలా జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పట్టణ ప్రాంతాల పాలన, పన్నుల వ్యవస్థ, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలకు సంబంధించిన సీయూఆర్ఈ చట్టం నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ మరింత సమర్థంగా ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాల విషయంలో చట్టం పరిధిలో వర్తించే నిబంధనలు ఏమి చెబుతున్నాయో అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.

అంజయ్యనగర్ దుర్ఘటనే ఒక హెచ్చరిక!

గతంలో గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో డ్రైనేజీ నాలాను ఆనుకుని, కేవలం 50 చదరపు గజాల స్థలంలో నిర్మిస్తున్న ఏడు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలి ఇద్దరు కార్మికులు (ఉమేష్ కర్రే, మోపత్) ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన అనంతరం కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్న అధికారులు, ముందస్తుగా అక్రమ నిర్మాణాలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంజయ్యనగర్ ఘటనను ఒక ప్రమాదంగా కాకుండా హెచ్చరికగా భావించి, అయ్యప్ప సొసైటీ పరిధిలో తక్షణమే భద్రతా తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హైడ్రా పనితీరుకు ప్రశంసలు.. మరి అయ్యప్ప సొసైటీలో చర్యలు ఎప్పుడు?

హైదరాబాద్ మహా నగరంలో చెరువులు, నాలాల పరిరక్షణతో పాటు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' యాక్షన్ ప్లాన్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. గాజులరామారం, మాదాపూర్, దుర్గం చెరువు, అమీర్‌పేట్, చందానగర్, బండ్లగూడ సహా నగర వ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా నాలాలు, చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మించిన బహుళ అంతస్తులను, కరకట్టల వద్ద వెలిసిన అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తూ హైడ్రా సృష్టించిన భయం, చూపించిన చొరవ నిజంగానే ప్రశంసనీయం. ఓ సామాన్యుడు వంద గజాల జాగాలో ప్రభుత్వం నుండి స్టిల్ట్ +2 అనుమతులు పొంది అదనంగా ఒక ఫ్లోర్ లేదా పెంట్ హౌస్ నిర్మించుకుంటే అక్రమ నిర్మాణమంటూ ఓ వైపు కమీషనర్, హైడ్రా కమీషనర్ భారీ బందోబస్తూ మధ్య పోలీస్ బలగాలను మోహరించి కూల్చివేతలు జరిపుతున్న నేపథ్యంలో... ఐటీ హబ్ నడిబొడ్డున ఉన్న 'అయ్యప్ప సొసైటీ' వద్దకు వచ్చేసరికి హైడ్రా ఎందుకు నిశ్శబ్దాన్ని పాటిస్తోంది? అయ్యప్ప సొసైటీలో భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు, సెట్ బ్యాక్‌ల ఉల్లంఘనల ఆరోపణలు, ఫైర్ సేఫ్టీపై ఆందోళనలు, నోటరీ స్థలాల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో హైడ్రా దృష్టి ఈ ప్రాంతంపై ఎప్పుడు పడుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హైడ్రాలో ఉన్న కొంతమంది ఉన్నతాధికారులకు అయ్యప్ప సొసైటీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఉండడం తోనే అటువైపు కన్నెత్తి చూడటం లేదనే వాదన మరోవైపు వినిపిస్తోంది. బ్యూరోక్రాట్లు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి వెనుక ఉన్న రియల్ మాఫియా, కొంత మంది షాడో లీడర్ల అండ ఉండటంతోనే హైడ్రా అటువైపు వెళ్లడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.



అయ్యప్ప సొసైటీ రోడ్ నెంబర్ 40 లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం



చందా నాయక్ నగర్ లో



చందా నాయక్ నగర్ లో



శ్రీ చైతన్య ఐ ఐ టి అకాడమీ సమీపంలో



వెంకటేశ్వర స్వామి టెంపుల్ సమీపంలో



సిద్ధి వినాయక నగర్ లో

# ముంబైకు సీఎం రేవంత్ రెడ్డి

### ఫడ్నవీస్ తో కీలక చర్చలు

ముంబై, మహా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం రాత్రి ముంబై వెళ్ళారు. సోమవారం మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ తో భేటీ కానున్నారు. రెండు రాష్ట్రాల మధ్య గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న జల వివాదాలకు పరిష్కారం కనుగొనే దిశగా ఈ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది. అదే విధంగా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ ఎత్తు పెంపు అంశంపై సీఎం రేవంత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో... ఈ భేటీ కీలకంగా మారుతోంది. సీఎంతో పాటు ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొననున్నారు. తుమ్మడిహట్టి బ్యారేజ్ ఎత్తును 152 మీటర్లకు పెంచడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు పూర్తిగా తీరుతాయని ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ఎత్తు పెంచితే మహారాష్ట్రలో ముంపు ఏర్పడుతుంది. దీంతో అక్కడ ముంపునకు గురయ్యే భూములు, అక్కడి గిరిజన ప్రాంతాల ప్రజల ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి రేవంత్ రెడ్డి సర్కార్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది.

**ముఖ్యమంత్రి కీలక చర్చలతో**

మహారాష్ట్రలో జరిగే భూ సేకరణ భారాన్ని, ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిగా తామే భరిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నుండి అవసరమైన అనుమతులు సాధించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బ్యారేజీ ఎత్తు పెంపుదల వల్ల ఇరు రాష్ట్రాల్లోని గ్రామాలు ముంపు నకు గురవుతాయనే అపోహలను, ఆందోళనలపైన తెలంగాణ ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది. తమ లెక్కలతో పాటుగా సాంకేతిక నివేదికలను మహారాష్ట్ర సీఎం ముందుంచి, వారికున్న అనుమానాలను నివృత్తి చేసి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ సాధించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్ జరిపే చర్చలు ఏ మేర ఫలిస్తాయనేది ఇప్పుడు రాజకీయం గానూ కీలకంగా మారుతోంది. ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఆదిలాబాద్ సస్యశ్యామలం కానుంది.

## 'వసుధైవ కుటుంబకం' కేవలం మాటల్లో కాదు..
# ఆచరణలో చూపిస్తున్నాం

- కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్



**న్యూఢిల్లీ, మహా** : ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ప్రఖ్యాత భారత్ మంటపంలో నిర్వహించిన 'చిన్మయ అమృత్ మహోత్సవ్' గ్లోబల్ సమ్మేళనంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ అనుసరిస్తున్న విదేశీ విధానం, 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) సిద్ధాంతాన్ని దేశం ఎలా ఆచరణలో పెడుతుందో ఆయన స్పష్టం చేశారు. కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా ఆచరణాత్మక చర్యలతో ప్రపంచ దేశాల మన్ననలు పొందుతున్నామని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి విలయం సృష్టించిన క్లిష్ట సమయంలో దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా సాగుతున్నప్పటికీ, ఇతర వెనుకబడిన దేశాలకు కూడా టీకాలను అందించి భారత్ తన పెద్ద మనసు చాటుకుందని జైశంకర్ గుర్తుచేశారు. కేవలం టీకాలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో వందలాది అభివృద్ధి ప్రాజెక్టులను భారత్ నేడు విజయవంతంగా నిర్వహిస్తోందని, శిక్షణ, సామర్థ్య నిర్మాణ సంస్థలలో ఇతర దేశాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. నేపాల్, శ్రీలంక, వెనిజులా లేదా జమైకా వంటి దేశాల్లో ఎక్కడైనా ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు భారత్ ఎప్పుడూ ముందుండి స్పందించి ఆదుకుంటోందని ఆయన వివరించారు. ప్రపంచంలో నెలకొన్న ప్రస్తుత యుద్ధ వాతావరణంపై జైశంకర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ మరియు పశ్చిమాసియా ప్రాంతాల్లో జరుగుతున్న రెండు ప్రధాన యుద్ధాల ప్రభావం నేరుగా సంబంధం లేని అనేక దేశాలపై, వాటి ఆర్థిక వ్యవస్థలపై తీవ్రంగా పడుతోందని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై మనం మూగప్రేక్షకులుగా మిగిలిపోలేమని స్పష్టం చేస్తూ, సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలు మాత్రమే ఏకైక మార్గమని భారత్ బలంగా విశ్వసిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితిలో సంస్కరణల ఆవశ్యకతను ఆయన గట్టిగా నొక్కిచెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి బలహీనతలను, పరిమితులను గుర్తించి తక్షణమే మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని జైశంకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ నిర్ణయాధికారాల్లో కీలక భాగమైన దేశాలను పక్కనబెట్టలేమని, సంక్షోభాల వేళ ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్ర పోషించకుండా నిజమైన నాయకత్వాన్ని వహించాలని ఆయన హితవు పలికారు.

## ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

భువనేశ్వర్ : ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయి. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.

## కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి దంపతులకు ప్రతిష్ఠాత్మక 'శంకరరత్న' పురస్కారం!

- చెన్నైలో ఘనంగా జరిగిన కార్యక్రమం.
- మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు ప్రదానం.

చెన్నై, మహా : ప్రముఖ సేవా సంస్థ శంకరనేత్రాలయ అందజేసే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'శంకరరత్న పురస్కారం2025'కు కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి దంపతులు ఎంపికయ్యారు. చెన్నైలోని శంకరనేత్రాలయ ప్రధాన ప్రాంగణంలో నిర్వహించిన ఒక ప్రత్యేక వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఈ పురస్కారాన్ని దంపతులకు అందజేసి ఘనంగా సత్కరించారు. దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా, మాజీ ఇస్రో చైర్మన్ డాక్టర్ జీ మాధవన్ నాయర్, ఏఎం నాయక్, ఎస్. రామదొరై, దీపక్ పరేఖ్ వంటి ప్రముఖులు గతంలో అందుకున్న ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని పొందడం ద్వారా ప్రసాద్ రెడ్డి దంపతులు అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి దంపతులు సమాజానికి చేస్తున్న నిస్వార్థ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వీరి సేవలను ఆదర్శంగా తీసుకుని, సాధ్యమైనంత రీతిలో సేవా కార్యక్రమాలకు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సన్మాన వేదికపై ప్రసాద్ రెడ్డి దంపతులు తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. శంకరనేత్రాలయ సంస్థకు అదనంగా మరో లక్ష డాలర్ల విరాళాన్ని అందజేశారు. దీనితో కలుపుకుని ఇప్పటివరకు వారు శంకరనేత్రాలయకు మొత్తం 6,25,000 డాలర్ల భారీ ఆర్థిక సహాయం అందించినట్లయింది. తద్వారా అమెరికాలో ఈ సంస్థకు అత్యధికంగా విరాళాలు అందజేసిన దాతలుగా వారు రికార్డు సృష్టించారు. అంతేకాకుండా, అత్యంత ఆధునిక హంగులతో కూడిన సరికొత్త 'మేసు' బస్సు యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రసాద్ రెడ్డి దంపతులు అందిస్తున్న సేవలను గుర్తించి ఇటీవల న్యూజెర్సీ రాష్ట్ర సెనేట్ ప్రత్యేకంగా ప్రొక్లమేషన్ జారీ చేసి అభినందించడం విశేషం. అవార్డు స్వీకరణ అనంతరం శంకరనేత్రాలయ అమెరికా అధ్యక్షులు బాలరెడ్డి ఇందుర్తి తదితరులు మైసూర్‌లోని శ్రీ దత్తపీఠాన్ని సందర్శించి, అవధూత శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. సంస్థ భవిష్యత్తులో కర్ణాటకలో చేపట్టబోయే ఉచిత కంటి వైద్య సేవా కార్యక్రమాలను స్వామీజీకి వివరించగా.. ఆయన తన పూర్తి ఆశీస్సులను, సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, శంకరనేత్రాలయ చైర్మన్ డాక్టర్ సురేంద్రన్, ఇండియా అధ్యక్షుడు డాక్టర్ గిరీష్ రావు, అమెరికా అధ్యక్షుడు బాలరెడ్డి ఇందుర్తి, ప్రముఖులు, దాతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' పేరిట ఢిల్లీలో మెగా ర్యాలీ

**ఉచిత ప్రచారం కల్పిస్తున్న బీజేపీకి థ్యాంక్స్ : రాహుల్ గాంధీ**

**ఢిల్లీ, మహా** : 'సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' పేరుతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న 'జన్ మార్చ్ అండ్ మెగా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ మేరకు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో 'సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' పేరుతో నిర్వహిస్తున్న ర్యాలీలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలి. విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు అంటూ తేడా లేకుండా అందరూ ఈ ర్యాలీలో పాల్గొని.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడాలి. ఓటర్ల జాబితాల నుండి పేర్లను తొలగించారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘించారు. ప్రశ్నించిన వారిపై లాఠీలతో దాడి చేశారు. ఓటు మీది.. పోరాటం కూడా మీదే. రాబోయే 7 రోజుల పాటు ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించండి. తమ చర్యల ద్వారా కార్యక్రమానికి పరోక్షంగా మరింత ప్రచారం కల్పిస్తున్నందుకు బీజేపీకి కృతజ్ఞతలు' అంటూ రాహుల్ పోస్ట్ చేశారు.




## కనులపండుగగా.. జూ వన్ యాప్ ప్రారంభం

**(మహా నెట్ వర్క్)** ఒకే యాప్ లో అనేకరకాల సేవలు.. జూవన్ సరికొత్తసంచలనంగా ప్రజలముందుకు వచ్చింది. విభిన్న ఆలోచన, వినూత్న ఆచరణతో సురేంద్రబాబు అండ్ టీమ్ రూపొందించిన ఈ యాప్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా సౌత్ ఇండియాలోనే సరికొత్త సంచలనంగా మారింది. ఫోన్లలో ఉండే పదిరకాల యాప్ లు కాకుండా.. ఒకేయాప్ లో 25రకాల సేవలందించే సంచలనం జూవన్. ప్రముఖ నటి ఇంద్రజ, ప్రముఖ జర్నలిస్ట్, మీడియా ఎంటర్ ప్రెన్యూర్,. ఎఎన్ఎన్, మహాపత్రికల ఫౌండర్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, బ్రాండ్ అంబాసిడర్ రాధిక తదితరులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. గచ్చిబౌలిలో ఆత్మీయవాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫౌండర్ సురేంద్రబాబె కు అతిథులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.





# ఒకే యాప్‌లో 25 రకాల సేవలు
# జూ వన్ యాప్ ప్రారంభం

( మొదటి పేజీ తరువాయి )

జుబన్ సూపర్ యాప్.. వ్యక్తిగత, కుటుంబ అవసరాలకు సంబంధించిన 25 రకాల సేవలను ఒకే చోట అందించనుంది. ఫుడ్ డెలివరీ, గ్రాసరీ, ఫార్మసీ నుంచి క్యాబ్ బుకింగ్, హోటల్ రిజర్వేషన్లు, షాపింగ్, ఆరోగ్య సేవలు, గృహ నిర్వహణ వరకు అనేక సదుపాయాలను ఇందులో పొందుపరిచారు. పట్టణాలతో పాటు సెమీ అర్బన్ ప్రాంతాల ప్రజలకు సైతం డిజిటల్ సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించారు.

***ఫుడ్ నుంచి హెల్త్ వరకు.. అన్నీ అందుబాటులో!**

ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల ఆర్డర్లతో పాటు క్యాబ్ బుకింగ్, కార్లు-బైక్‌ల అద్దె, లాజిస్టిక్స్, ప్యాకర్స్ అండ్ మూవర్స్ సేవలను జుబన్ ద్వారా పొందవచ్చు. హోటళ్లు, రిసార్టులు, హాస్టళ్లు, పీజీ వసతి, ఈవెంట్లు, పర్యాటక సేవలకు సంబంధించిన సదుపాయాలనూ అందిస్తున్నారు. అలాగే షాపింగ్, బ్యూటీ పార్లర్, ఇంటి శుభ్రత, పెస్ట్ కంట్రోల్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఏసీ సర్వీసులు, కంప్యూటర్, మొబైల్ మరమ్మతుల వంటి గృహ, సాంకేతిక సేవలకూ ఈ యాప్ వేదికగా నిలవనుంది. వైద్యుల సంప్రదింపులు, ల్యాబ్ పరీక్షలు, నర్సింగ్ సేవలు వంటి ఆరోగ్య సంబంధిత సదుపాయాలనూ ఇందులో పొందుపరిచారు.

**ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు: ఇంద్రజ**

యాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటి ఇంద్రజ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజల రోజువారీ అవసరాలకు అనుగుణంగా వివిధ సేవలను ఒకే వేదికపై అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి వినూత్న ప్రయత్నాలు ప్రజల సమయాన్ని ఆదా చేయడంతో పాటు సేవలను సులభంగా పొందేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జుబన్ సూపర్ యాప్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

**ఆధునిక జీవనశైలికి అనుగుణంగా జుబన్: కంది రామచంద్రారెడ్డి**

ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ వ్యవస్థాపక సీఈవో కంది రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, సాంకేతికతను ప్రజల రోజువారీ అవసరాలకు అనుసంధానించే దిశగా జుబన్ సూపర్ యాప్ ముందుకొచ్చిందన్నారు. వివిధ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వినియోగదారులకు సౌలభ్యం కల్పించడంతో పాటు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

**ప్రజల ఆదరణే లక్ష్యం: బ్రాండ్ అంబాసిడర్ రాధిక**

జుబన్ బ్రాండ్ అంబాసిడర్ రాధిక మాట్లాడుతూ, ఆహారం, షాపింగ్, ప్రయాణం, ఆరోగ్యం, గృహ అవసరాల కోసం ఒకే యాప్‌లో సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ యాప్‌కు విస్తృత ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**వినియోగదారుల సమయాన్ని ఆదా చేయడమే లక్ష్యం: సురేంద్రబాబు**

జుబన్ ఫౌండర్, సీఈఓ పి. సురేంద్రబాబు మాట్లాడుతూ, ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించిన సేవలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఆలోచనతో ఈ సూపర్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఫుడ్, గ్రాసరీ, ట్రావెల్, హెల్త్ నుంచి ఇంటి నిర్వహణ వరకు అనేక సేవలను ఒకే యాప్‌లో అందించడం ద్వారా వినియోగదారుల సమయాన్ని ఆదా చేయాలనుకుంటున్నామని చెప్పారు. సులభమైన డిజిటల్ సేవలను ప్రజలకు చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జుబన్ ప్రొప్రైటర్ బి. వివేక్ మాట్లాడుతూ, ప్రయాణం, షాపింగ్, ఆహారం, వైద్యం, గృహ అవసరాల కోసం వేర్వేరు వేదికలను ఆశ్రయించాల్సిన పరిస్థితిని తగ్గించడమే తమ ప్రయత్నమన్నారు. సౌకర్యం, వేగం, వినియోగదారులకు సులభమైన అనుభవం అందించడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పట్టణాలతో పాటు సెమీ అర్బన్ ప్రాంతాల్లోనూ సేవలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

# శత్రువులకు ఏదీ మనకు దూరం కాదు

- ఆపరేషన్ సిందూర్'తో భారత్ సత్తా చాటామ్ .
- ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ హెచ్చరిక!






న్యూఢిల్లీ, మహా : భారత వైమానిక దళం చేపట్టిన 'ఆపరేషన్‌సిందూర్' దేశ సత్తా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పిందని, శత్రువులు ఐఏఎఫ్ దళాల నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని వైమానిక దళాధిపతి (ఎయిర్ చీఫ్ మార్షల్) ఏపీ సింగ్ స్పష్టం చేశారు. ఓ జాతీయ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఆయన పాకిస్థాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా శత్రువులకు స్పష్టమైన సందేశం పంపామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా సుమారు 1,200 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల పరిధిలోని కీలక లక్ష్యాలపై వైమానిక దళం అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించిందని వెల్లడించారు.

**భవిష్యత్తు సామర్థ్యాల పెంపుపై దృష్టి:**

ఈ చారిత్రాత్మక విజయాన్ని చూసి ప్రస్తుత సామర్థ్యాలతోనే ఆగిపోరాదని, భవిష్యత్తులో మరింత పటిష్టంగా వైమానిక దళ సన్నాహాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సింగ్ నొక్కిచెప్పారు. ప్రత్యర్థి వ్యూహాలు మారుతున్న కొద్దీ వేగంగా స్పందించేందుకు వివిధ ప్రత్యామ్నాయాలను అందుబాటులో ఉంచుకోవడం అత్యంత కీలకమన్నారు. ఒకే ఆయుధం లేదా ఒకే వ్యవస్థపై పూర్తిగా ఆధారపడకుండా, అనేక రకాల సామర్థ్యాలను వినియోగించుకోగల దళంగా ఎదగాలని తెలిపారు. సరైన సమయంలో పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఉద్రిక్తతలు మరింత పెరగకుండా నియంత్రించగలిగామని చెప్పారు.

**ఉగ్రవాదంపై ఉక్కుపాదం - పౌరులకు రక్షణ:**

గతేడాది మే నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి దీటైన బదులిచ్చేలా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలతో పాటు, పాక్ ఆక్రమిత ప్రాంతాలు, శత్రు భూభాగంలోని కీలక లక్ష్యాలపై శక్తివంతమైన దాడులు నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా తాము ఎంచుకున్న వ్యూహం నూటికి నూరుపాటూ సరైనదేనని నిరూపించామని ఏపీ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని, దేశం మరోసారి బాధ్యత అప్పగిస్తే మరింత వేగంగా, కచ్చితత్వంతో దళాలను సిద్ధం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**స్వదేశీ పరిజ్ఞానమే శ్రీరామరక్ష:**

ఈ ఆపరేషన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అనేక ఆయుధ వ్యవస్థలు అసాధారణ పనితీరు కనబరిచాయని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. శత్రు భూభాగంలో లోతుగా ఉన్న లక్ష్యాలపై తీవ్ర ప్రభావం చూపేలా దాడులు చేశామని చెప్పారు. ఈ మొత్తం ఆపరేషన్‌లో పౌరుల ఆస్తులకు, ప్రాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించామన్నారు. కేవలం ఒకే ఆయుధం లేదా యుద్ధ విమానం వల్లనే ఈ విజయం సాధ్యం కాలేదని, కచ్చితమైన నిఘా సమాచారం (ఇంటెలిజెన్స్), నెట్‌వర్క్ ఆధారిత ఆపరేషన్లు, శత్రు పరిధికి వెలుపలి నుంచే ప్రయోగించగల ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వంటి అత్యాధునిక సాంకేతికతల సమ్మిళితంతోనే ఆశించిన ఫలితాలు సాధించామని ఆయన వివరించారు.

## ఉత్కంఠ రేపుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు

( మొదటి పేజీ తరువాయి )

నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగియడంతో పోటీలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై క్రమంగా స్పష్టత వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 28 జిల్లా పరిషత్‌ల పరిధిలో జరగనున్న ఈ ఎన్నికల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు, 659 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల పోరు హోరాహోరీగా సాగనుంది. గ్రామస్థాయిలో పట్టు నిలుపుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

అక్టోబర్ 23తో నామినేషన్ల స్వీకరణ ముగిసే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఏకంగా 51,902 నామినేషన్లు, 659 జెడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీల వారీగా పరిశీలిస్తే, ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ తరఫున 22,013, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 20,556, జనసేన నుంచి 4,609, భారతీయ జనతా పార్టీ నుంచి 1,150 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే జెడ్పీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 2,078, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 1,815, జనసేన 679, బీజేపీ 255 నామినేషన్లను సమర్పించాయి.

నామినేషన్ల పరిశీలన అనంతరం తిరస్కరణకు గురైన పత్రాలపై అభ్యంతరాలు తెలిపేందుకు, అప్పీళ్లు దాఖలు చేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఆ గడువు ముగిసిన వెంటనే ఎన్నికల అధికారులు పోటీలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను అధికారికంగా ప్రకటించనున్నారు. అభ్యర్థులకు గుర్తుల కేటాయింపుతో నియోజకవర్గాల్లో ప్రచార హోరు మరింత ఊపందుకోనుంది.రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించనుండగా, అవసరమైన ప్రాంతాల్లో నవంబర్ 4న రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఆ తర్వాత నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.81 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, దీనికోసం అధికారులు మొత్తం 35,333 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించే ఈ స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయ పార్టీలకు అగ్నిపరీక్షగా మారాయి.

## కర్ణాటకలో కన్నడిగులకే ప్రాధాన్యం

( మొదటి పేజీ తరువాయి )

సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రైవేట్ సంస్థలు కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'ఎట్టిపరిస్థితుల్లో కన్నడిగుల హక్కులు, గౌరవం, అవకాశాలను తక్కువ చేయడానికి ప్రభుత్వం అంగీకరించదు' అని స్పష్టం చేశారు. బెంగళూరును ప్రపంచం భారతదేశపు ఐటీ రాజధానిగా చూస్తోందని, తమ కన్నడిగుల నైపుణ్యాలు, సామర్థ్యాలపై ప్రభుత్వానికి ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.

## 'రామాయణ' ప్రభంజనం

( మొదటి పేజీ తరువాయి )

మరోవైపు భారీ విజువల్స్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో టికెట్ ధరలు భారీగా ఉన్నాయి. ముంబైలో కొన్ని ఐమ్యాక్స్ థియేటర్లలో రిక్లెయినర్ సీటు ధర రూ.3,170 వరకు పలుకుతోంది. పీవీఆర్ ఐకాన్: ఫీనిక్స్ పల్లాడియంలో ఉదయం 7 గంటల షోకు రిక్లెయినర్ టికెట్ ధర రూ.1,850గా ఉండగా.. ఆ షో ఇప్పటికే హౌస్‌ఫుల్ అయినట్లు సమాచారం. ఢిల్లీఎన్‌సీఆర్ ప్రాంతంలో ఐమ్యాక్స్ 3డీ షోల టికెట్ ధరలు రూ.1,550 నుంచి రూ.2,400 వరకు ఉన్నాయని తెలుస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్‌లో కనిపిస్తున్న స్పందనతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తి స్పష్టమవుతోంది.



## విమానాశ్రయంలో భారీగా హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

- సింగపూర్ నుంచి వస్తున్న ప్రయాణికుడి అరెస్ట్.
- బ్యాంకాక్ నుంచి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించిన విశాఖ డీఆర్ఐ అధికారులు!

**భోగాపురం,మహా** : విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) అంతర్జాతీయ విమానాశ్రయంలో విశాఖపట్నం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం మెరుపు తనిఖీలు చేపట్టారు. ముందస్తు పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు.. విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కోల్‌కతాకు చెందిన నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

బ్యాంకాక్ నుంచి సింగపూర్ మీదుగా.. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్ (36) అనే నిందితుడు బ్యాంకాక్‌లో గంజాయిని సేకరించాడు. అక్కడి నుంచి సింగపూర్ మీదుగా 'స్కూట్' విమానంలో ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాడు. ముందస్తు సమాచారం ఉన్న డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టులో నిందితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో నిందితుడి వద్ద సుమారు 4 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక వాతావరణంలో సాగు.. దర్యాప్తు ముమ్మరం: సాధారణ మట్టి లేకుండా, నియంత్రిత కృత్రిమ వాతావరణంలో అత్యాధునిక పద్ధతిలో సాగు చేసే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి బ్యాంకాక్ హోల్ సేల్ మార్కెట్ లో కిలోకు సుమారు రూ.30 వేల వరకు ధర ఉన్నట్లు సమాచారం.

## ఎక్స్‌లో సరికొత్త ఫీచర్

- లైక్ బటన్ నొక్కితే క్రియేటర్‌కు నేరుగా డాలర్ టిప్!
- ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన.



**ఢిల్లీ, మహా** : సోషల్ మీడియా దిగ్గజం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వినియోగదారులకు మరో అద్భుతమైన మరియు విప్లవాత్మకమైన ఫీచర్‌ను పరిచయం చేసేందుకు సిద్ధమవుతోంది. ఇకపై పోస్టులకు సాధారణంగా లైక్ చేయడంతోపాటు, ఆ పోస్టును ప్రచురించిన కంటెంట్ క్రియేటర్లకు నేరుగా నగదు రూపంలో ఆర్థిక మద్దతు తెలిపేలా సరికొత్త సదుపాయాన్ని తీసుకురావాలని ఎక్స్ యోచిస్తోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధినేత ఎలాన్ మస్క్ అక్టోబర్ 25న ఎక్స్ వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వస్తే సోషల్ మీడియా వినియోగదారులు తమకు నచ్చిన కంటెంట్ రూపకర్తలకు సులభంగా టిప్స్ అందించే అవకాశం లభిస్తుంది.ప్రస్తుతం యూజర్లు పోస్టులకు లైక్ చేయడం, కామెంట్లు పెట్టడం, రీపోస్ట్ చేయడం ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే రాబోయే రోజుల్లో కేవలం లైక్ బటన్‌నే చెల్లింపుల కోసం కూడా ఉపయోగించుకునేలా ఈ ఫీచర్‌ను తీర్చిదిద్దుతున్నారు. దీని పనితీరు ఎంతో సులభంగా ఉండనుంది. యూజర్లు పోస్టుకు ఇచ్చే లైక్ బటన్‌ను కొద్దిసేపు నొక్కి ఉంచితే (లాంగ్ ప్రెస్), సంబంధిత పోస్టు చేసిన క్రియేటర్‌కు నేరుగా ఒక డాలర్ ($1) నగదు వెళ్లేలా ఈ విధానాన్ని ప్రతిపాదించారు.అమెరికాలో 'ఎక్స్ మనీ' సేవలు ఇప్పటికే అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సేవల ద్వారా వినియోగదారులు ఒకరి నుంచి మరొకరికి సులభంగా నగదు బదిలీ చేసుకోవడంతో పాటు, ఎక్స్ వీసా డెబిట్ కార్డు ద్వారా ప్రత్యక్షంగా డిజిటల్ రూపంలో చెల్లింపులు చేసే అవకాశం ఉంది. అయితే, ఈ లైక్‌టిప్స్ ఫీచర్ ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది, దీనిని వినియోగించుకోవడానికి క్రియేటర్లు పాటించాల్సిన అర్హత ప్రమాణాలు ఏమిటనే అంశాలపై ఎక్స్ ఇంకా పూర్తి వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం ఎక్స్ మనీ సేవలు కేవలం అమెరికాకే పరిమితమై ఉండగా.. భారత్‌లో ఈ సేవలను ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 26-10-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

# విదుషీమణి సరోజన

తెలుగునాట ఆత్మకథలు రాసుకున్న వారు చాలా తక్కువ. అందులోనూ మహిళలు రాసుకున్న ఆత్మకథలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఇందులోనూ బీసీ మహిళల ఆత్మకథలు చాలా అరుదు. ఈ అరుదైన ఆత్మకథతో పాటు, ఎక్కువ సాహిత్యాన్ని సృజించిన విదుషీమణి బండ సరోజన. కవయిత్రిగా, కథకురాలిగా, రేడియో ప్రసంగకర్తగా, తెలంగాణ భాష సౌందర్యాన్ని ఇనుమడించిన భాషావేత్తగా, పాఠ్యపుస్తకాల నిర్మాతగా, అన్నింటికి మించి ఎనిమిది పదుల వయసులోనూ సాహిత్యం, సమాజం, సంస్కృతి, భాషా విషయాల్లో తనదైన పద్ధతిలో ప్రజ్ఞను ప్రదర్శించిన విద్యావేత్త. ఈ ప్రజ్ఞామూర్తి మొన్న అక్టోబర్ 22న అమెరికాలో ఆంగ్ల కవయిత్రి, కూతురు అపర్ణ కదారి వద్ద కన్నుమూశారు. 1941లో ఇప్పటి సిద్దిపేట జిల్లా, ఒకప్పటి వరంగల్ జిల్లా లద్నూర్‌లో మధ్యతరగతి పద్మశాలి కుటుంబంలో జన్మించిన బండ సరోజన తండ్రి ప్రోత్సాహంతో చదువుకున్నది.

నివాళి



సొంతూర్లో పాఠశాల ఏర్పాటు కోసం, ఆడపిల్లల విద్యాభ్యాసం సజావుగా సాగేందుకు గాను తండ్రి మల్లయ్య ఆకాలంలోనే ఆర్థికంగా అండగా నిలిచిండు. ఆ తరువాత పొరుగూరు మద్దూరుకు చదువుకోసం పంపించాలంటే సంకోచించాడు. అయితే సరోజన మొండి పట్టుదలతో సిద్దిపేటలో 1960 ప్రాంతంలో బేసిక్ టీచర్ ట్రెయినింగ్ విద్యనభ్యసించింది. ఈ సమయంలోనే సాహితీరంగంలోకి ప్రవేశించింది. దేశభక్తి, సందేశాత్మక గీతాలను రాసి ఆలపించేది. ఈమె ప్రతిభను గమనించి అప్పటికే సిద్దిపేటలో టీచర్‌గా పనిచేస్తున్న సుప్రసిద్ధ కవి, మెదక్ జిల్లా రచయితల సంఘం నిర్వాహకులు వేముగంటి నరసింహాచార్యులు ప్రోత్సహించారు. ఒకప్పుడు వేముగంటి శిష్యురాలిగా ఉన్న సరోజన ఆ తర్వాత కాలంలో బియిడి కళాశాలలో ఆయనకే గురువుగా బోధించారు. ఓరియంటేషన్ కోర్సు కోసం వేముగంటి హైదరాబాద్‌కు వస్తే వారికి ఆమె బోధించారు. ఈ విషయాలన్నీ తన ఆత్మకథ 'సరోజం'లో రికార్డు చేశారు. నిజానికి ఈ 'సరోజం' పేరు పెట్టడానికి వేముగంటి నరసింహాచార్యులు స్ఫూర్తి. సిద్దిపేటలో జరిగిన కవి సమ్మేళనంలో సరోజనను మెచ్చుకుంటూ "సిద్దిపేట అనే సరస్సులో ఉద్భవించిన సరోజం' అని అభినందించాడు. అందుకే 'సరోజం' అనే పేరుని ఆత్మకథకు పెట్టుకున్నట్లు సరోజన రాశారు.

మహిళలు టీచర్లుగా, అదీ ఉన్నత స్థాయి విద్యాసంస్థల్లో బోధించడం చాలా అరుదు. ఈ అరుదైన పనిని లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రొఫెసర్‌గా సరోజన మాసబ్‌ట్యాంక్‌లోని బియిడి కళాశాలలో చేశారు. 'ఆంధ్రప్రదేశ్ పాఠ్యపుస్తకాల్లో స్త్రీ హోదా చిత్రణ' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో 1994 ఇంగ్లాండ్‌లోని లీడ్స్ యూనివర్సిటీలో పాఠ్యపుస్తకాల నిర్మాణంపై శిక్షణ పొందారు. ఎస్సిఇఆర్టి (scert)లో పనిచేశారు. అనియత విద్య, తెలుగు విశ్వవిద్యాలయం నవోదయ పోతాయా ప్రణాళిక, cbse పుస్తకాల రూపకల్పనలో కీలక పోషించారు. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పాఠ్యపుస్తకాల రూపకల్పన శాస్త్రీయంగా లేవూ అంటూ విమర్శించారు. కోర్టుని సైతం ఆశ్రయించారు. బియిడి కళాశాలలో ఆమె వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు తెలంగాణలోని ప్రతి మండలంలోనూ ఉన్నారు అంటే అతిశయోక్తి కాదు.

సమకాలీన సమస్యలను చిత్రిస్తూ 'సప్త స్వరాలు', 'ఒక పూవు పూసింది', 'ఎర్రమందారం' అనే కవితా సంపుటాలను వెలువరించారు. అట్లాగే తన జ్ఞాపకాలు, తలపులను, వెతలను అక్షరబద్ధం చేస్తూ రాసిన కథలను 'బఱ్రెంక సెట్టు' పేరిట తీసుకొచ్చారు. తెలంగాణ భాషలో 'గాలి పడిగెలు' పుస్తకాన్ని రాసింద్రు. 'అక్షర రూపాలు' పేరిట మరో పుస్తకాన్ని ప్రచురించారు. రేడియో ప్రసంగాలు 'లచ్చుమమ్మ ముచ్చట్లు', 'అక్షరమే ఆయుధం' అనే పుస్తకాలను వెలువరించారు. ఇట్లా తెలుగు సాహిత్యంలో కవయిత్రిగా, కథకురాలిగా, వ్యాసకర్తగా, పాటల రచయిత్రిగా, రేడియో ముచ్చట్ల ప్రసంగకర్తగా పలువిధాలుగా సేవలందించారు. తెలంగాణ సమాజాన్ని నిత్యం చైతన్యం చేసిన స్ఫూర్తిప్రదాతకు నివాళులు.

**డా. సంగిశెట్టి శ్రీనివాస్**
**9849220321**

# జీవితం పట్ల ప్రేమ మృత్యువు పట్ల ఆరాధనల సంగమ స్థలి

నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా సినిమా గుర్తుందా ? అందులో అల్లు అర్జున్ కోసం వంశీ పైడిపల్లి ఒక మంచి డైలాగ్ రాశాడు . "నువ్వు ఇండియా లో ఉంటే ఇండియన్ వి కాదు . నీలో ఇండియా ఉండాలి . నీలో ఇండియా ఉందా ?"అనేది ఆ డైలాగ్ . ప్రముఖ బెంగాలీ కవి బిభాస్ రాయ్ చౌదరి అవార్డు పొందిన కవిత్వం జెసూర్ రోడెర్ గచ్ (జెసూర్ రహదారి పక్కన చెట్లు) , పోయెమ్ కంటిన్యూయస్ రే ఇన్ కార్నేటెడ్ ఎక్స్ప్రెషన్స్ చదువుతున్నప్పుడు నాకు పదే పదే ఆ డైలాగ్ గుర్తుకువచ్చింది

1968 లో తొలి శ్వాస ను అందుకుని 1990 నుండీ కవిత్వం రాయడం మొదలుపెట్టిన బిభాస్ రాయ్ చౌదరి ఇవ్వాళ బెంగాలీ లో పేరెన్నికగన్న కవి . సునీల్ గంగోపాధ్యాయ , డాక్టర్ అలోక్ రంజన్ దాస్ గుప్తా , జాయ్ గోస్వామి లాంటి కవుల అవ్యాజమైన అనురాగం తో పాటు పలు అవార్డులు రివార్డులు అందుకున్న కవి .

"జీవితానికీ , కవిత్వానికీ మధ్య గుండె చప్పుడు లాంటి ఒక రిథమాటిక్ స్పేస్ ను నిలుపుకున్న కవి . అతడి కవిత్వం అంతా సంక్షోభాల , పోరాటాల చుట్టూ తిరిగినా , సామాన్య పాఠకుడి లో కవిత్వం నింపవలసిన కలల అలలని అలా ఎగురవేస్తుంది . అతడి కవిత్వం మనలని ఒక ప్రశాంత చిత్తం లోకి నడిపిస్తుంది "అంటారు అలోక్ రంజన్ దాస్ గుప్తా "

అతడి కవిత్వం చదువుతూన్నప్పుడు ఒక బెంగాలీ కవిత్వం చదువుతున్నట్టుగా కాక ఒక తెలుగు కవిని చదివినట్టుగానే అనిపించింది . మా లాగే 1990 ల లో కవిత్వం రాయడం మొదలుపెట్టినవాడు కనుక మా తరం ఉద్వేగాలు ఏవో అతడి కవిత్వం లో కనిపించాయి . మన శిఖామణి కవిత్వం లో కనిపించే ఈస్థటిక్స్ , సీతారాం లో కనిపించే రవ్వంత మృత్యు ప్రీతి , చిన వీరభద్రుడి లోని రవ్వంత మార్మికత నాకు బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం లో కనిపించాయి . అందుకేనేమో అతడి కవిత్వాన్ని చాలా గొప్పగా అనుభవించగలిగాను . అతడి కవిత్వం లో అనువవుఖునా బెంగాలీ తత్వం (Bengaliness) కనిపిస్తూ ఉంటుంది . తెలుగుతనం అంటే ఒక్క మాటలో ఎలా నిర్వచించాలేమో ఈ బెంగాలీ తత్వాన్ని కూడా మనం ఒక్క మాటలో నిర్వచించలేము . అక్కడి చెట్ల గాలి , అక్కడి నదుల ప్రవాహ సరిగమలు , అక్కడి శిఖరాలు తమ లోయలతో చేసే గుసగుసలు , అక్కడి ప్రజల ఆశలు , ఆశాభంగాలు , కలలు , కౌగిళ్లు , సంగీతం ,సంప్రదాయం, భాష ,ఇలా ఎన్నో కలిస్తే బెంగాలీనెస్ అవుతుంది . ఇవన్నీ బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం లో పుష్కలంగా ఉంటాయి .

"కవిత్వం అంటే కేవలం కొన్ని పదాలను సేకరించి పేర్చడం కాదు . కవిత్వం అంటే కచ్చితంగా ఆలోచనలను ప్రోది చేయడం . కవిత్వం అందునా మంచి కవిత్వం రాయడం లో ఉన్న చిక్కులన్నింటినీ చాలా ఓపిగ్గా విడదీయడం నేర్చుకోవాలి "అని బిభాస్ రే చౌదరి గురువు , అతడు కవిత్వం లో అడుగుపెట్టడానికి కారణమైన శుభామ్ కర్ పాత్రా అంటారు. బెంగాలీ కవిత్వం నన్ను హైప్నటైజ్ చేసింది అనే రాయ్ కి కవిత్వ అనువాదం పట్ల స్థిరమైన అభిప్రాయాలే వున్నాయి

"కవిత్వ అనువాదం పట్ల నాకు పెద్దగా ప్రేమ కానీ నమ్మకం కానీ లేదు . కవిత కేవలం కవికి సంబంధించిన విషయమే కాదు . అది భాషకి కి సంబంధించినది కూడా . ఒక కవి తన ఆలోచనలను ,అనుభూతులను, ఉద్వేగాలను వెల్లడించడానికి ఎన్నుకునే భాష దానికి మాత్రమే ప్రత్యేకమైన కొన్ని లక్షణాలు , సరళత్వం ,స్థిరత్వం , గాన యోగ్యత , లాంటివి కలిగివుంటుంది . ఇవన్నీ కవిత్వ నిర్మాణం లో భాగమౌతాయి , అనువాదం లో ఇవన్నీ అలాగే వుండవు . ఎందుకంటే భాష మారుతుంది కనుక . అనువాద కవిత అసలు కవిత కి భిన్నంగా ఉంటుంది.
ఆలోచనలు కొంత వరకు అనువాదం అయి పాఠకుడికి అందుతాయి . కానీ భాషలోని న్యూనాన్స్ అంతా అనామకంగా మిగిలిపోతాయి . అందుకే ఎక్కువగా సామాజిక , విషయ ప్రాధాన్యత ఉన్న కవితలే ఎక్కువగా అనువాదం అవుతూ ఉంటాయి. కానీ కవిత విస్తరించాలంటే అనువాదం తప్పదు "అంటాడు బిభాస్ రాయ్ చౌదరి.

అయితే బిభాస్ రాయ్ చౌదరి అభిప్రాయాలకు భిన్నంగా అతడి కవిత్వాన్ని అద్భుతంగా అనువాదం చేసి చూపించాడు కీర్తి సేన్ గుప్తా . కీర్తి సేన్ గుప్తా




కూడా బెంగాలీ లో మంచి కవి కావడం వలననే భాషలోని చిన్న చిన్నఅంశాలను కూడా పట్టుకోగలిగారు అని నేను అనుకుంటున్నాను . బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం లో మృత్యువు అనే ఒక మైలు రాయిని చేరుకునే పథం లాంటి నేపథ్యాన్ని , ఆలోచనల అల్లికను , గుండెలను తాకి మరీ నొప్పించే నోస్టాలజియాను , అతడి కి మాత్రమే పరిమితమైన sadomasochism ని అద్భుతంగా అనువాదం లో కి తీసుకుని రాగలిగాడు . ఉదాహరణకి ఈ చిన్న కవిత చూడండి

తనతో మాట్లాడుకుంటూ
నీ లోపల భయం ఉంటే
భయపడనీ
నీ లోపల నదిలో మునక వేయగల శక్తి ఉంటే
మరింత మునగనీ
నేనిప్పుడు దేని గురించీ బాధపడను
మేమిద్దరం రెండు పురాతన దర్పణాలం
ఒకరి నొకరం కొరుక్కుంటాము మరణం కొరకు

ఒక మనిషి తనలో తానూ ఒంటరి అయిన మనిషి తన లోపలి మనిషి తో నిరంతరమూ ఘర్షణ పడుతూ మృత్యువు కోసం ఎదురు చూడటం చోదరి ఎంత గొప్పగా రాశాడో అంత గొప్పగానూ కీర్తి సేన్ అనువదించాడు . తన లోపలి మనిషి అంటే తన అహం , తానూ ఇద్దరూ రెండు పురాతన అద్దాలం అనడము మరణించే వరకు ఒకరి నొకరు కొరుక్కుంటాము అనడము లోలోపలి ఒక సంతృప్తిని , అసంతృప్తిని వ్యక్త చేయడానికి ఎన్నుకున్న పదాలు . ఇలాంటప్పుడే భాష అశక్తత తెలిసేది . మరో కవిత

**మై లిటిల్ గర్ల్**

నీతో ప్రేమలో పడిపోయాను
ఓ కవితా ..!
నువ్వు నా సంకేతాలన్నీ ,సంజ్ఞలన్నీ
చిందరవందర చేశావు
లేచీ లేవగానే
బిగించిన నీ పెదవుల మీద
ఒక చిన్న అలక
నువ్వు మరీ చిన్న పిల్లవుతున్నావు
ఏ క్షణమైనా కన్నీరై ప్రవహిస్తావు
జీవితం నాన్న లాంటిది
నేను నా కూతురు తో
కనీసం ఒక మాట చెప్పగలను
యుద్ధం చేయమని
నిద్రాహారాలు మాని యుద్ధం చేయమని

ఈ చిన్ని కవిత లో తండ్రి కవి . కూతురు కవిత్వం . కవిత్వం చేయవలసిన పని ఏమిటో . అది జనానికి ఏమి చెప్పాలో చిన్న చిన్న పదాలలో చౌదరి దృశ్యమానం చేస్తే కీర్తిసేన్ గుప్తా అంతే గొప్పగా అనువాదం చేసాడు . మరో కవిత చూడండి

**సంధానకర్త**

నిన్ను ప్రేమించాను
అని చెప్పడానికి
గొంతు కోసుకుని నోటి నుండి నెత్తురు కక్కుతూ
చెప్పడం లో అర్థం లేదు
ఒక్క పదాన్ని కూడా ఉచ్చరించకుండానే
నీ ప్రేమను వ్యక్తం చేయగలవు
అవును నువ్వు చేయగలవు
మమ్మల్ని ఎంతయినా హింసించనీ
నిన్ను ప్రేమిస్తున్నాని ఒక్క మాట కూడా చెప్పం
రెప్ప వాల్చకుండా
నీ వంకే చూస్తాము
నేను మేము అంటున్నప్పుడు
మేము అంటే
రహదారి పక్కన పూచిన పువ్వులు
ఊరిని ఆనుకుని ప్రవహించే నదీ
ఇంకా పేరు తెలియని ఎన్నో పక్షులు
మా ప్రేమను వ్యక్తం చేయడానికి
మేమెప్పుడూ అరచి గోల చెయ్యం
జీవితమంతా మేము పక్కపక్కనే
నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉంటాము
అలా అని మేము ద్వేషిస్తామని కూడా కాదు
కానీ ఈ ఉదయం
ఈ సంధానకర్త ఒక చివర నుండి
తిరిగి రమ్మని మెట్రో పోలీస్ కి చెప్పాము

ప్రేమ , మృత్యువు , బిభాస్ రాయ చౌదరి లో కవిత్వం లో ఎక్కువగా చోటు వెతుక్కోవడానికి కారణాలను ప్రపంచీకరణ విధానాలలో , బెంగాల్ కి మాత్రమే పరిమితమైన వామపక్ష రాజకీయాలలో , నందిగ్రామ్ సంఘటనలో , మమతా బెనర్జీ యుధం లో మనం వెతుక్కోవాలి . ఎందుకంటే అతడు కవిగా కన్ను తెరచిన దశాబ్దం భారత దేశ చరిత్ర లోనే ఒక సంక్షుభిత దశాబ్దం కనుక . తెలుగు దేశం లో 1990 ల లో కళ్ళు తెరచిన కవులు ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం రాస్తున్నప్పుడే ఎం .ఎస్ నాయుడు , నామాడి శ్రీధర్ లాంటి వాళ్ళు ఒక కొత్త అభివ్యక్తినీ , వస్తువును ఎన్నుకున్న విషయం మనకు గుర్తుకు వస్తుంది . మీరు క్షమిస్తే ఈ వ్యాసకర్త వెలువరించిన "కొన్ని నేనులు "కూడా ఒక కొత్త వస్తువును ఎన్నుకునే క్రమం లో వచ్చిన కవిత్వమే జాన్ కీట్స్ తన "ode to a nightingale " "లో " where youth grows pale, and spectre thin,and dies" అని చెప్పినట్టుగా చౌదరి లో మృత్యువు పట్ల ఈప్రేమ జీవితం పట్ల ద్వేషం గా మారలేదు . టాగోర్ కవిత్వం ఇక్కడ చౌదరిని ఆవహించి దారి చూపించాడు . టాగోర్ దృష్టి లో మృత్యువు అంటే "జీవితం నిరంతరం కొనసాగడానికి మృత్యువు ఒక గేట్ వే "కదా . చౌదరి కూడా తన కవితలలో మృత్యువును తప్పనిసరి అతిథి ని గుర్తిస్తూనే కవిగా తన అమరత్వాన్ని బలంగా ప్రకటించాడు స్మృతి లేఖనం అనే కవిత లో ఈ విషయాన్ని గమనించవచ్చు

**స్మృతి లేఖనం**

ఒక సాయంత్రం మృత్యువు లాగే ఉంటుందని
నేను చెప్పాను



కీర్తి సేన్ గుప్తా

చెప్పానా ? లేదా ?
ఈ అక్షరాల లోతులలో
కొంత కాలం నేను మిగిలి వుంటాను
నేను
మీరు
నా పాఠకులు

బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం సరళం గా ఉన్నట్టు కనిపిస్తూనే పదచిత్రాలు మీద పదచిత్రాలు గుప్పించి పాఠకుడిని సమ్మోహ పరుస్తుంది . పెద్ద పెద్ద పొడవాటి కవితలు రాయడు తాను . చాలా చిన్నవిగా పది పంక్తులకు మించకుండానే పాఠకుడిని వశం చేసుకోవడం చోదరికి బాగా తెలుసు

గుల్జార్ గ్రీన్ పోయెట్రీ లాంటిదే చౌదరి "జెసోర్ రోడెర్ గచ్ "జెసోర్ రహదారి పక్క చెట్లు అనే కవితా సంపుటి . సేవ్ ది ట్రీ మూవ్మెంట్ లో చౌదరి పాల్గొన్నపుడు అలవోకగా రాసిన కవిత్వం అది . "తుమీ వాలో ఆచో " ( నువ్వు బావున్నావా ? ) అనే కవిత చూడండి . కొంత ప్రోజాయిక్ గా వున్నా ఎంత బావుందో చూడండి

నువ్వు బావున్నావా ?
నువ్వెప్పుడూ యజమానివి కాదు
జీవితం క్షణికం
దాని లోతు ఎంత చూడగలవో అంతా చూడు
బాధను నిరంతరం నమ్మగలవా ?
అది హింసనూ , అసూయనూ ఆకర్షించదు
చెట్టునూ పుట్టనూ పక్షినీ పాటనూ అన్నింటినీ ప్రేమించు
నువ్వు బావున్నావా ?
పదే పదే ప్రశ్నించు
నువ్వు బావుంటావు

బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం చదవడం మంచి అనుభవం . జీవితం పట్ల ప్రేమ మృత్యువు పట్ల ఆరాధనల సంగమ స్థలి బిభాస్ రాయ్ చౌదరి కవిత్వం:



**వంశీకృష్ణ**
**9573427422**

# ఊరేగింపు



పదహారవ శతాబ్దపు కవి
పట్టిన ఘంటాన్నీ రాసిన కావ్యాన్నీ
తిరూర్ వీధుల్లో ఈ ఉదయాన ఊరేగిస్తున్నారు
కవి చేతి ముద్రలిచ్చిన అచ్చులతో
ఘంటమూ కావ్యమూ ఉత్సవంలో
మెరిసిపోతున్నాయి
ఊరేగింపులో మాతో పాటు
కవి తుంచనూ ఉన్నట్టున్నాడు
కదులుతున్న పద్య పాదాల్లో కలిసి
పోయి -
కవిని సాదిన పాత శతాబ్దాన్ని
ఊరు మరొకమారు
కొత్త కన్నులతో తమకంతో చూస్తున్నది
ధవళ వస్త్రాల ప్రమదలు పట్టిన హారతులలో
ప్రాచీన పద్యకాంతి మిళితమవుతున్నట్లుంది
వాయిద్యాలు పద్యాల్లోని మలయాళ జీవలయను
ప్రేక్షకాకాశం సాక్షిగా హృద్యంగా ఆవిష్కరిస్తున్నాయి
వీధులు పద్య సందోహపు
పర్వ సంరంభంతో కిక్కిరిసి పోయాయి
సూర్యరేఖలు ఘంటం మీద వాలి
అదనపు కాంతిని అందుకుంటున్నాయి
గాలులుప్పొంగి కావ్యం చుట్టూ తిరుగుతూ
పురాతన నృత్యం చేస్తున్నాయి
ఇప్పటి కాంక్రీట్ గోడల్లోకి ఇవాళ
ఒకనాటి అరణ్య ఆశ్రమ ప్రశాంతతలు
పరమ కరుణతో ప్రవేశిస్తున్నాయి
కావ్యంలోని అలంకారాలు లేచొచ్చి
తిరూర్ కు కొత్త తోరణాలు
కడుతున్నాయి
కాలదేవతల్లా వీధులకిరువైపున
దీర్ఘంగా నిలిచిన చెట్లు
పూర్వ కవిని ఊరేగింపులో
కాంచడానికి
వేల పత్ర నేత్రాలతో సిద్ధంగా
వున్నట్లున్నాయి
ఒకనాడు
కవి తుంచన్ పాదముద్రలను
హత్తుకున్న అదృష్టాన్ని తలుచుకుని
మరొకమారు తిరూర్ ధన్యతాచింతనతో
చెమ్మగిల్లుతున్నది!

(కేరళలోని తిరూర్ లో ఏటా జరిగే ఉత్సవంలో 16వ శతాబ్దపు మలయాళ కవి తుంచన్ ఘంటాన్నీ, ఆయన కావ్యాన్నీ ఊరేగిస్తారు. ఈ యేడు ఆ ఊరేగింపులో పాల్గొని వచ్చాక రాసిన కవిత )

**దర్భశయనం శ్రీనివాసాచార్య**
**94404 19039**

# తెలంగాణ రచయితల సంఘం పన్నెండేండ్ల సభలు

వర్తమాన సాహిత్యం తెలంగాణ సంభాషణ
1 నవంబర్, 2026, ఆదివారం
ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
వేదిక: రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్
సభాధ్యక్షులు
డా. నాళేశ్వరం శంకరం
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
ప్రారంభ సమావేశం
కీలకోపన్యాసం
కె. శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు
అతిథులు
నందిని సిధారెడ్, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ
డా. ఏనుగు నరసింహా రెడ్డి IAS
డైరెక్టర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
దేవీ ప్రసాద్, పూర్వ అధ్యక్షులు, TNGO
విరాహత్ అలీ, అధ్యక్షులు , TUWJ
బైస దేవదాసు, ఎడిటర్, నేటి నిజం
డా. వి. శంకర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం
1.30 2.30 మధ్యాహ్న భోజనం
మధ్యాహ్నం సదస్సు 2.30 4.00
సభాధ్యక్షులు
డా. బెల్లంకొండ సంపత్ కుమార్ ప్రధాన కార్యదర్శి, తెరసం జంట నగరాలు
వక్తలు
ఎన్. వేణు గోపాల్, ఎడిటర్, వీక్షణం
ఆచార్య బన్న అయిలయ్య
కాకతీయ విశ్వ విద్యాలయం
ఆత్మీయ అతిథి
డా. నామోజు బాలాచారి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ఆప్తవాక్యం
కొండపల్లి నిహారిణి, రచయిత్రి
కవి సమ్మేళనం 4.00
సభాధ్యక్షులు
కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు, తెరసం జంట నగరాలు
ఆత్మీయ అతిథి
డా. జయ ప్రకాశ్, తెలుగు భాషా చైతన్య సమితి
సుప్రసిద్ధులైన నలభై మంది కవుల/ కవయిత్రుల కవితా పఠనం.

**తెలంగాణ రచయితల సంఘం**

# మన పిడికిలిలో... అంతర్జాతీయ తెలుగు కవిత్వ వెన్నెల..!




డాక్టర్ పెరుగు రామకృష్ణ సాహితీ వనంలో ప్రాణం పోసుకున్న కొత్త కవితా సంపుటి.. *"పిడికిలి వదిలినప్పుడు". వృద్ధాప్యం ఓ ఖాళీ కుర్చీ కాదు; కొత్త విత్తనాల కోసం ఎదురుచూస్తున్న నేల అంటూ ఆశావాద కిరణాలతో ఆరంభంలోనే పాఠకులకు ప్రేరణ వెలుతురును పంచారు. మనమే నాటిన చెట్లు మన నీడ కోసం కాదు, ఆకాశం హద్దుగా ఎదగడానికంటూ సందేశాత్మక ప్రవచనాలు వినిపిస్తున్నారు. నువ్వు దగ్గరగా వచ్చిన ప్రతిక్షణం అలల మధురమంతా నా లోపల చేరి సాగే నది కూడా నెమ్మదై నిశ్శబ్దంగా వినింది... అంటూ యువతరాలకు ప్రేమ పద్యాలలోని మాధుర్యపు లోతులను చూపిస్తున్నారు. కన్నీళ్ల కంటే కరెన్సీ కి విలువ పెరిగిన చోట మనుషులు కాదు; అవసరాలే సహజీవనం చేస్తున్నాయంటూ ఆధునిక ప్రపంచం ఆత్మను ఆవిష్కరిస్తున్నారు. డిజిటల్ తెరల మీద ఓటీపీ క్షణాలను, పాత ఫోటోల వెనుక దుమ్ము పట్టిన జ్ఞాపకాలను అన్నింటినీ సంయోగం చేస్తూనే సరికొత్తగా రాయడం నేర్పిస్తున్నారు..!

చిన్న గొంతుల్లో పెద్ద నిశ్శబ్దాల మధ్య ఈ యుద్ధం నిర్వచనం ఏమిటంటూ ఆవేదనా గీతమై ప్రశ్నిస్తున్నారు! మీరు ఆకాశాన్ని చీల్చినప్పుడల్లా నా లోపల ఉదయించని ఉదయాలు మరణిస్తున్నాయి వంటి భావోద్వేగ వాక్యాలు చాలా సులువుగా లిఖించేస్తున్నారు! మౌనం పెద్దగా మాట్లాడుతుంటే... అందులోని అంతర్లీనాన్ని అర్థం చేసుకునేలా అనుభవాన్ని సంపాదిస్తున్నారు. టోల్ ప్లాజా గురించి కవిత రాస్తూ... ఆ టోల్ ప్లాజా డబ్బు తీసుకునే గది మాత్రమే కాదు, ప్రయాణాల మధ్య మనిషి మనిషిని గుర్తు చేసుకునే ఒక క్షణపు విరామమనీ.. కాదేది కవిత కనర్హం అని పలికిన శ్రీ శ్రీ గారి మాటల్ని గుర్తు చేస్తున్నారు. ఈ ఉగాది కొత్త పంచాంగం మాత్రమే కాదు/ కొత్త ప్రమాణం కావాలంటూ మనలోని మార్పుకు స్వాగతం పలుకుతున్నారు. పటాలపై గీసిన గీతల కోసం నేల ఎంత రక్తం తాగింది/గాలి ఎంత ఆర్తనాదాలతో నిండింది/నది ఎంత కన్నీటితో ఉప్పొంగింది వంటి బలమైన ఆర్ద్రత,సాంద్రత తో కూడిన కవిత్వాన్ని అందరికీ అర్థమయ్యేలా పెరుగు రామకృష్ణ గారే చెప్పగలరు..!

పూర్ణిమ వెలుగులా నీ చూపు నా మీద పడిన క్షణం సముద్రం ఒక్కసారిగా తన అలలను మరిచిపోయింది...! వంటి భావ కవితా పాదాలతో ప్రకృతి పరవశించేలా.. తన హృదయంతో అందమైన కవిత్వం పలు చోట్ల ఆవిష్కరించారు ఈ పుస్తకంలో..! నీవు కేవలం వంట పాత్రవి కాదు/ఒక శతాబ్దపు అమ్మ హృదయానివి అనేంత కవితాత్మక పరిశీలన, సునిశిత అధ్యయనం గల కవి రామకృష్ణ. అనంత శూన్యంలో సంభాషిస్తూ ఇలా గడిచిందో కూడా చెప్పగలడు. రాబోయే రోజుల్లో సమూహంలో ఉన్న మనిషి ఒంటరే అనే హెచ్చరికను మళ్లీ మళ్లీ వినిపించగలరు..! కవిత్వం, కన్నీరు కలిసి ఒకే ధారగా మార్చగలరు. ఇసుక తీరం తాకి తిరిగిళ్ళే కలగా నీటి చుక్క జ్ఞాపకాలను మిగిల్చగలడు..! ప్రశ్నలు బతికున్నంత కాలం ప్రజాస్వామ్యం కూడా బతికే ఉంటుందన్న విశ్వాసాన్ని పాఠకుల్లో నింపగలడు..! కొత్త పౌర స్వప్నాలను ఈ మట్టిలో మొలకెత్తించగలడు..! రూపం మారిన ప్రశ్నలను రూపాంతరంగా వర్ణించగలడు..! అసలైన ఉదయానికి తన హృదయం సాక్షిగా ఓ కొత్త నిర్వచనం ఇవ్వగలడు. అంబేద్కర్ ప్రతి అడుగులో ఆవిర్భవించిన ఆత్మగౌరవాన్ని జ్ఞాన గర్జనంగా అందరికీ అర్థమయ్యేలా కవితగా రాయగలడు..!

సృజనను శ్వాసగా చేసి, సౌందర్యాన్ని ఆత్మగా చెప్పారు ఒక కవితలో. నయాగారాన్ని పడినా,లేచి పరుగెత్తే జీవన శైలికి ఆదర్శమంటూ చరిత్ర సాక్షిగా చెప్పారు ఇంకో కవితలో. ఇలాంటి 54 కవితలతో కొత్త కవిత్వ దారిని నిర్మించారు. ఓ యువతి స్వగతం, ఉక్కు వలలు, నేను నడిచిన దారి ఇంకా పరిమళిస్తుంది, చివరికి ప్రేమే మిగులుతుంది, అమ్మ వెళ్లిన తర్వాత, సముద్రం మిగిలే ఉంది వంటి విభిన్న శీర్షికలతో రామకృష్ణ అక్షర ప్రవాహం, ప్రభావం, పరిమళం.. పాఠకులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది..! భిన్న సబ్జెక్టుల్లో మాస్టర్ పట్టా పొందిన ఈ "ప్రత్యేక కవి" తన మేధస్సుకు తగ్గట్లే.. అలతి పదాలతో, అలవోకగా, అనంత భావావేశంతో ప్రపంచమే తన ప్రాంతంగా, సగటు మనుషుల పైన విపరీతమైన ప్రేమతో అనంత విశ్వమే హద్దుగా కవితల్ని రాయగలరు. లక్షల మంది గొంతుకై వినిపించగలరు; దశాబ్దాల ప్రశ్నలకు పరిష్కారము చూపగలరు. వివిధ రకాల ప్రతిష్ఠాత్మకమైన సంస్థల ద్వారా 150 జాతీయ అవార్డులు, 60 విదేశీ అవార్డులు, మెడల్స్, ఫెలోషిప్పు ఎన్నో అందుకున్నప్పటికీ.. నేటి కవులను ప్రోత్సహిస్తూనే, వాళ్లకు సైతం పోటీగా రాస్తూనే ఉన్నారు..!

ఈ సందర్భంగా ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ సుంకర గోపాల్ గారి "జీవన తీరాల కవితా పరిమళం" ఆస్వాదించాల్సిందే..! సంక్లిష్టమైన పండిత భాషకు దూరంగా ఉంటూ.. సంక్లిష్టమైన తాత్విక అంశాలను కూడా దైనందిన సంభాషణల లాగా సరళమైన వచనంలో అందిస్తూ, ప్రతి కవితలోనూ ఒక అగాధమైన ఆర్ద్రత పాఠకుని ఆలోచింపచేసేలా రామకృష్ణ రాయగలరు..! కవిత్వం వ్యక్తిగత అనుభూతులతో ఆగిపోకుండా, సామాజిక పీడితుల, శ్రమజీవుల గొంతుగా మారాలని రామకృష్ణ గారు బలంగా అభిప్రాయపడతారు..! ఈ పుస్తకాన్ని వీలు చేసుకుని మళ్లీ మళ్లీ చదవాలి.. పూర్తిగా ఆకలింపు చేసుకోవడానికి చాలా టైం పడుతుంది. అయినా.. ఈ పుస్తకం మళ్లీ మళ్లీ చదివేలా ప్రేరణ ఇస్తూనే ఉంటుంది..! I Have strongly recommended...!

మన ఇంటి లైబ్రరీ గుండెల్లో తప్పకుండా భద్రంగా దాచి ఉంచాల్సిన పుస్తకం ఇప్పుడు మీ పిడికిలి లో ఉంది..! పిడికిలి వదిలినప్పుడు కాస్త జాగ్రత్త..! పెరుగు రామకృష్ణ గారు మన ఇంట్లోనే ఉండిపోతారు..!!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

# సమూహ యువ సాహిత్యోత్సవం
# 2026 గోడల్ని ఛేదిద్దాం

**మొదటి సెషన్:** 9.30 11.15 ప్యానల్ డిస్కషన్
సంస్కృతి ఆధిపత్య వ్యవస్థలు
స్వాగత ప్రసంగం: సుంకిరెడ్డి నారాయణ రెడ్డి
వక్త : జి యస్ రామ్మోహన్ (బి బి సి, ఢిల్లీ)
గౌరవ అతిథి: సూర్యా ధనంజయ్
మోడరేటర్: స్కై బాబ
ప్యానలిస్టులు: యం యం వినోదిని, చల్లపల్లి స్వరూపరాణి, రచన ముద్రబోయిన, జాబాలి, అఖిల్ సూర్య
నిర్వహణ : గుడిపల్లి నిరంజన్
**రెండవ సెషన్:** 11.15 12. 25
డిజిటల్ మాధ్యమాలు అసమ్మతి స్వరాలు
వక్త : రవీశా
మోడరేటర్: కె. వి. కూర్మనాథ్
ప్యానలిస్టులు: తులసి చందు, ముద్దం స్వామి, సుమేరా, విప్లవ శ్రీనిధి,
నిర్వహణ : సిద్దెంకి యాదగిరి
**మూడవ సెషన్:** 12.25 1.35
కొత్తతరం సాహిత్య స్వరం
వక్త : వేణు ఊడుగుల
మోడరేటర్: శివన్నగారి చంద్రయ్య
ప్యానలిస్టులు: జయలక్ష్మి ఎ, సందీప్ వోటారికారి, స్వప్న కొండమడుగు, చిక్కొండ్ర రవి, సూర్య చంద్ర
నిర్వహణ : హాథీరాం సభావట్
లంచ్ బ్రేక్ 1.35 2. 15
**నాలుగవ సెషన్:** 2.15 3 25
చదువుల మానిఫెస్టో మేమెక్కడ?(విద్యార్థుల ఆలోచన)
వక్త : భంగ్యా భూక్యా
మోడరేటర్: క్రాంతి
ప్యానలిస్టులు: దిల్షాదా (HCU) ఉదయ్ కుమార్ (OU) వంశీకృష్ణ (KU) అన్విత మామిడిపల్లి (WU) సంతోష్ ఎస్రం (IIT)
నిర్వహణ : ఇబ్రహీం నిర్గుణ్
**అయిదవ సెషన్:** 3.25 4. 30
ప్రదర్శన కళలు సామాజిక మార్పు
వీధి నాటిక ప్రదర్శన : అజయ్ మంకెనపల్లి టీమ్
వక్త: ధీరజ్ రావణ తేజ
ఆత్మీయ అతిథి : నిర్మల JNFAU
నిర్వహణ: మెర్సీ మార్గరెట్, కుంజ కల్యాణి
కవి సమ్మేళనం : 4. 30 6. 30
కవిత్వంతో Gen Z
ఆత్మీయ అతిథి : కవి యాకూబ్
నిర్వాహకులు :ఆర్ సీతారాం, గాజోజు నాగభూషణం, రూపరుక్మిణి , యువకవులు 40 మంది

**ఏ కే ప్రభాకర్**

**రచనలకు ఆహ్వానం**
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా: haneef777@gmail.com whatsapp 9247580946



## టికెట్ అడిగిందని.. కండక్టర్‌ను బస్సులోంచి తోసేసింది..!

- బస్సు వెనుక చక్రాల కింద పడిన మహిళా కండక్టర్..
- మణుగూరు డిపో కండక్టర్ ప్రవళికకు తీవ్ర గాయాలు..
- భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలింపు..
- ఉచిత ప్రయాణానికి ఆధార్ చూపకపోవడంతో వివాదం..
- కండక్టర్ ను పరామర్శించిన ఆర్టీసీ అధికారులు, కార్మిక సంఘాల నేతలు

**మణుగూరు/అశ్వాపురం :** ఉచిత బస్సు ప్రయాణానికి ఆధార్ కార్డు చూపించాలని కోరిన మహిళా కండక్టర్‌ను ఓ ప్రయాణికురాలు బస్సులోంచి కిందకు నెట్టివేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక బస్సు వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడటం తీవ్ర కలకలం రేపింది. ఏఎన్ఎన్ మహాకు అందిన సమాచారం ప్రకారం.. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఆధార్ కార్డు చూపించకపోవడంతో కండక్టర్ ప్రవళిక టికెట్ ఛార్జీలు చెల్లించాలని కోరారు. ఈ విషయమై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహానికి గురైన మహిళా ప్రయాణికురాలు కండక్టర్ ప్రవళికను బస్సు బయటకు నెట్టివేసినట్లు సమాచారం.



దీంతో ఆమె బస్సు వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ప్రవళికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**ఆసుపత్రిలో కండక్టర్‌కు పరామర్శ**

ఘటన విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఈదురు వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి జీఎస్ నారాయణ, మణుగూరు డిపో మేనేజర్ శ్యాంప్రసాద్, భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్యలు ఆసుపత్రికి చేరుకుని గాయపడిన కండక్టర్ ప్రవళికను పరామర్శించారు. మణుగూరు, భద్రాచలం డిపోలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు కూడా ఆసుపత్రికి చేరుకుని ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి గాయాల తీవ్రత, అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై జరిగిన ఈ ఘటన ఆర్టీసీ ఉద్యోగవర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. కాగా కండక్టర్ ప్రవళిక కు మెరుగైన వైద్యం అందించేందుకు 108 అంబులెన్స్ ద్వారా హైదరాబాద్కు తరలించినట్లు సమాచారం.

## అల్పపీడన ప్రభావం.. ఖమ్మం జిల్లాకు భారీ వర్ష సూచన!

- ఈ నెల 28న పలు ప్రాంతాలలో అత్యంత భారీ వర్షా లు
- గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- రైతులు పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. కలెక్టర్ దివాకర టీఎస్



**సత్తుపల్లి, అక్టోబరు 25: మహా :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. భారత వాతావరణ శాఖ అక్టోబరు 25న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 28న జిల్లాలో పలు ప్రాంతాలలో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికల వివరాలను కలెక్టర్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని తెలిపారు. 28న భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వివరించారు. 29న కూడా జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని పేర్కొన్నారు.

**పంటల రక్షణకు ముందస్తు చర్యలు**

వర్ష సూచన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలకు నష్టం వాటిల్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**ఉరుములు, మెరుపుల వేళ అప్రమత్తత అవసరం**

ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని కలెక్టర్ హెచ్చరించారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందవద్దని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, అధికారుల హెచ్చరికలను గమనించాలని కోరారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రదేశాలలో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. భారత వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం అందించే సూచనలను ప్రజలు, రైతులు తప్పనిసరిగా పాటించాలని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.



## నేడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు రానున్న మంత్రి సీతక్క

**జోడేఘాట్ లో జరిగే కొమురంభీం వర్ధంతి వేడుకలకు హాజరు**

**రాత్రి నిజామాబాద్ లో బస**

**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి సీతక్క సోమవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకు రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటల వరకు కొమురంభీం సమాధి జోడే ఘాట్ చేరుకుంటారు. అక్కడ జరిగే ఆదివాసీల ఆరాధ్యదైవం కొమురంభీం వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు.అనంతరం సాయంత్రం 4 గంటలకు అక్కడినుండి బయలు దేరి నిజామాబాద్ చేరుకుంటారు రాత్రి అక్కడే బస చేస్తారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు.





## నిరుపేదలకు అండగా సనాతన హిందూ సేవా సమితి

**విజయవంతమైన 250 వ సేవా కార్యక్రమం**

**వరంగల్, మహా :** నిరుపేదలకు అండగా నిలుస్తూ అభాగ్యులకు మేమున్నామని భరోసానిస్తున్న మన సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో 250 వ సేవా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం పూర్తిగా ఏ ఆధారం లేక ఆరోగ్య సమస్యలు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వరంగల్ కాశిబుగ్గ కు చెందిన బొద్దుల విజయ వృద్ధురాలికి రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ సేవా సమితి ఇంత గొప్ప కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తామని ఇప్పటివరకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సేవా సమితి వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సభ్యులు నోముల మహేష్ బాబు, గంగిడి ధర్మారెడ్డి, బండారి సంపత్, పెరుమాండ్ల శ్రవణ్, మేరుగు కరుణాకర్, ముప్పారపు ప్రభాకర్, దిడ్డి మోహన్, నాగుల మోహన్, కందుకూరి రాజు, కూచన ఏకాంబరం, ప్రతాపగిరి గణేష్, ఓదెల తిరుపతి, మునికుంట్ల రామకృష్ణ, దూడం రాజు పాల్గొన్నారు.





## నిరుపేదలకు అండగా సనాతన హిందూ సేవా సమితి

**విజయవంతమైన 250 వ సేవా కార్యక్రమం**

**వరంగల్, మహా :** నిరుపేదలకు అండగా నిలుస్తూ అభాగ్యులకు మేమున్నామని భరోసానిస్తున్న మన సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో 250 వ సేవా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం పూర్తిగా ఏ ఆధారం లేక ఆరోగ్య సమస్యలు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వరంగల్ కాశిబుగ్గ కు చెందిన బొద్దుల విజయ వృద్ధురాలికి రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ సేవా సమితి ఇంత గొప్ప కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తామని ఇప్పటివరకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సేవా సమితి వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సభ్యులు నోముల మహేష్ బాబు, గంగిడి ధర్మారెడ్డి, బండారి సంపత్, పెరుమాండ్ల శ్రవణ్, మేరుగు కరుణాకర్, ముప్పారపు ప్రభాకర్, దిడ్డి మోహన్, నాగుల మోహన్, కందుకూరి రాజు, కూచన ఏకాంబరం, ప్రతాపగిరి గణేష్, ఓదెల తిరుపతి, మునికుంట్ల రామకృష్ణ, దూడం రాజు పాల్గొన్నారు.



## ఏఎన్ఎన్ ఎఫెక్ట్ ఆరోపణలెదుర్కొంటున్న హెచ్ ఎం పై చర్యలు

**సస్పెండ్ చేసామన్న ఐటీడీఏ పీవో**

**రెబ్బెన మహా:** ఏఎన్ఎన్ వార్తా కథనానికి అధికారులు స్పందించి ఓ హెచ్ ఎమ్ పై చర్యలు తీసుకున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని తీరుపై ఏఎన్ ఎన్ ఒక కథనాన్ని ప్రసారం చేసింది. ప్రధానోపాధ్యాయులు పవార్ రవీందర్ విధి నిర్వహణలో మద్యం సేవిస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపించారు. అలాగే బియ్యం పక్కదారి పట్టిస్తున్నాడన్న ఆరోపణలు తగు సాక్ష్యాలతో వార్త ప్రసారం కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. అతనిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఐటీడీఏ పీవో మంద మకరందు తెలిపారు. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ కొనసాగుతుండగా విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా నిబంధనల ప్రకారం ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, వసతి గృహ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.



## మణుగూరు బిటిపిఎస్ లో ఘోర ప్రమాదం..

- లిఫ్ట్ రోప్ తెగడటంతో ఒకరు మృతి..మరో ఇద్దరికి గాయాలు..
- సిమెంట్ మిశ్రమం తరలిస్తుండగా ప్రమాదం..
- కార్మికుల భద్రతపై ఆందోళన

**మణుగూరు, మహా :** భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. విద్యుత్ కేంద్రంలోని సిస్కన్ సంస్థకు చెందిన డీ వాటరింగ్ ప్లాంట్ వద్ద సివిల్ పనులు నిర్వహిస్తుండగా సిమెంట్ మిశ్రమాన్ని తరలించే లిఫ్ట్ రోప్ తెగి కార్మికులను తాకడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. వీరిలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కార్మికుడు మృతి చెందినట్లు తెలిసింది. మరో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పనులు కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా లిఫ్ట్ రోప్ తెగిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఊహించని ఘటనతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఆందోళనకు గురయ్యారు. మృతిచెందిన కార్మికుడి పేరు, ఇతర వివరాలతోపాటు గాయపడిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

**భద్రతా ప్రమాణాల అమలుపై ప్రశ్నలు..!**

మణుగూరు భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతాల్లో కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశం ఈ ప్రమాదంతో చర్చనీయాంశమైంది. సిమెంట్ మిశ్రమాన్ని తరలించే లిఫ్ట్ రోప్ ఎందుకు తెగింది..? పరికరాల సామర్థ్యాన్ని ముందుగానే పరిశీలించారా..? పనుల్లో నిమగ్నమైన కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు సమకూర్చారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం యాజమాన్యం, సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ప్రమాదంపై పూర్తి వివరాలను వెల్లడించడంతోపాటు బాధిత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమాచారం అందిన వెంటనే మణుగూరు సిఐ పార్థ్ నాగబాబు ఆసుపత్రికి చేరుకొని సంఘటనకు సంబంధించిన వివరాలను, ప్రమాదానికి గల కారణాలపై చరణ చేపట్టారు.





## గుడి హత్నూర్ మండలంలో పోలీసులు మీకోసం కార్యక్రమం

- పలు గ్రామాలలో 23 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ
- యువతకు హెల్మెట్ ల పంపిణీ
- ఉచిత వైద్య శిబిరం
- మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన
- వాలీబాల్ ,బతుకమ్మ పోటీల విజేతలకు బహుమతులు

ఆదిలాబాద్ మహా: పోలీసు -ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా 'పోలీసులు మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ జిల్లాఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గుడిహత్నూర్ మండలం కొల్లారి గ్రామంలో జిల్లా పోలీస్ శాఖా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాలలో 23 సీసీటీవీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. గ్రామాల భద్రతకు సీసీటీవీ కెమెరాలు ఎంతో కీలకమని, నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. 10 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా, మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఉత్తమంగా బతుకమ్మలు పేర్చిన మహిళలకు మొదటి మూడు బహుమతులను ఎస్పీ అందజేసి అభినందించారు.మహిళలకు అండగా షీ టీం అందుబాటులో ఉంటుందని తెలిపారు, యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువు మీద దృష్టిసారించి ఉన్నత చదువులను చదివి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ ఎల్. శ్రీకాంత్, సర్పంచ్ శివాజీ, ఉపసర్పంచ్ ఎస్. కిరణ్, వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతతో పాటు సుమారు 300 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బర్త్‌డే పార్టీపై పోలీసుల దాడి..



మొయినాబాద్ మహా: మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామ శివారులోని మ్యాంగో వుడ్ ఫామ్‌హౌస్ విల్లా నంబరు 13లో శనివారం నిర్వహిస్తున్న బర్త్‌డే పార్టీపై మొయినాబాద్ పోలీసులు దాడి చేశారు. అక్కడ గంజాయి, మద్యం సేవిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి పంచుల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరుగురు వ్యక్తులు పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించారు. వారిలో ఐదుగురిని విచారించి ప్రాథమిక మూత్ర పరీక్షలు నిర్వహించగా.. బీహార్‌కు చెందిన డ్యాన్స్ టీచర్ బిషు కుమార్ (25)కు గంజాయి వినియోగానికి సంబంధించిన టీహెచ్ సీ పరీక్షలో పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నలుగురి పరీక్షల్లో నెగిటివ్‌గా వచ్చిందని వెల్లడించారు.

## ఇందారంలో తీవ్ర విషాదం

**నీటికుంటలో పడి ముగ్గురు మృతి**

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం శివారులో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని నీటికుంటలో ప్రమాదవశాత్తూ ముగ్గురు మునిగి మృతి చెందారు. మృతిచెందిన వారిలో మణెమ్మ (24), కీర్తన (16), కావ్య (9)గా గుర్తించారు. వీరు గత కొంతకాలంగా ఇందారం గ్రామానికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం మధ్యాహ్నం బట్టలు ఉతికేందుకు ముగ్గురు నీటికుంట వద్దకు వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేక ప్రమాదవశాత్తూ మునిగిపోయారని చెప్పారు. స్థానికులు గమనించి బయటకు తీసేలోపే ముగ్గురు మృతి చెందారని వెల్లడించారు. సమాచారం అందుకున్న జైపూర్ ఎస్సై భూమేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో ఇందారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## వేంసూరు మండలంలో మంత్రి తుమ్మల పర్యటన

- మృతుల కుటుంబాలకు పరామర్శ.. పాత మిత్రులతో ఆత్మీయ పలకరింపులు

**సత్తుపల్లి, అక్టోబర్ 25:మహా :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం వేంసూరు మండలంలోని మర్లపాడు, కందుకూరు, దుద్దేపూడి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాత మిత్రులను ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలపై వినతి పత్రాలు అందుకున్నారు. అనంతరం మర్లపాడులో ఇటీవల మృతి చెందిన బర్ల పెద్ద పుల్లయ్య, కందుకూరులో గొర్ల రవికిషోర్‌రెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి సంతాపం తెలిపారు. దుద్దేపూడిలో మట్టా పద్మావతి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి పర్యటనలో సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా పురగిరి క్షత్రియ పెరిక సంఘం 27వ వార్షికోత్సవం

**నూతన కార్యవర్గం ఎన్నిక**

**నూతన అధ్యక్షుడిగా బుద్దే లక్ష్మీనారాయణ**

గిర్మాజీపేట, మహా ; పురగిరి క్షత్రియ పెరిక కుల సేవా సంఘం శివనగర్ వరంగల్ సంఘం కార్యాలయంలో ఆదివారం 27వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సుంచు కట్టమల్లు అధ్యక్షులుగా బుద్దే లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులుగా చింతం యాదగిరి, కానిగంటి స్వామి, సందెల రవి,కార్యదర్శిగా బేరా శంకర్ సహాయ కార్యదర్శులుగా పోతరాజు రాజేష్, దొరిశెట్టి రంగయ్య, సందెల రాంబాబు, బరపటి యాకయ్య తో పాటు కోశాధికారి మార్త రవి ప్రసాద్, సహాయ కోశాధికారులుగా ఎర్రంశెట్టి సతేందర్ చింతం విజయ్ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బుద్దే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 27 ఏళ్లుగా సంఘం సేవా కార్యక్రమాలు చేస్తూ కుల బాంధవుల ఐక్యత కోసం కృషి చేస్తోందని తెలిపారు. సంఘం అభివృద్ధికి, కుల బాంధవుల సంక్షేమానికి అందరం కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అందరి సహకారంతో సంఘం కార్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురగిరి క్షత్రియ పెరిక కుల పెద్దలు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ లో భగ్గుమన్న విభేదాలు!

- రాకేష్ రెడ్డి ప్రసంగిస్తుండగా రంజిత్ రెడ్డి వర్గం వాకౌట్
- రంజిత్ రెడ్డి వెనుక వందల మంది యువత, వాకౌట్

**హనుమకొండ, మహా ;** హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయా? వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం వేదికగా నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయనే చర్చ జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ హాజరైన ఈ సమావేశంలో నేతల మధ్య కనిపించిన దూరం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకుడు రాకేష్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో దుగ్గింపూడి రంజిత్ రెడ్డి వర్గానికి చెందిన నేతలు, కార్యకర్తలు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చినట్లు సమాచారం. రంజిత్ రెడ్డి సమావేశం నుంచి బయటకు రావడంతో ఆయన వెనుకే వందలాది మంది కార్యకర్తలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కొద్దిసేపటి క్రితం వరకు కార్యకర్తలతో సందడిగా ఉన్న సభా ప్రాంగణం ఒక్కసారిగా ఖాళీ అయినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ముఖ్య నేతల సమక్షం లోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చకు దారితీస్తోంది. ఎన్నికల వేళ నేతల మధ్య అసంతృప్తికి కారణాలేంటి? పార్టీ అంతర్గత విభేదాలు ఎన్నికల సన్నాహాల పై ప్రభావం చూపనున్నాయా? ఈ పరిణామాల పై పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

**ఆదిలాబాద్ మహా:** కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 26న ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు ఈ సెలవు వర్తించదని స్పష్టం చేశారు. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14 రెండవ శనివారం రోజున అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు పని చేయాల్సి ఉంటుందని సూచించారు.

### పాత కక్షలతోనే అన్వేష్‌పై దాడి..
## 8 మందిపై కేసు నమోదు

- గత వివాదాలే కారణమని పోలీసుల వెల్లడి
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ గట్ల సుధాకర్

**పెద్దపల్లి మహా :** కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో భాకం అన్వేష్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ గట్ల సుధాకర్ తెలిపారు. గతంలో ఇరు వర్గాల మధ్య ఉన్న వివాదాలు, పాత కక్షలే దాడికి కారణమని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన భాకం అన్వేష్‌కు, భాకం కిరణ్ కుటుంబ సభ్యులకు గతంలో వివాదాలు ఉన్నాయి. అన్వేష్ గతంలో కిరణ్ ఇంటి వద్దకు వెళ్లి పలుమార్లు దూషించినట్లు ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు విచారణలో గుర్తించారు.ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో అన్వేష్ తన పెద్దమ్మ రమ ఇంట్లో ఉండగా, భాకం కిరణ్ కుటుంబానికి చెందిన ఎనిమిది మంది అక్కడికి వెళ్లి దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్వేష్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ గట్ల సుధాకర్ వెల్లడించారు.

# పిడికిలి బిగిస్తే పిడుగుల వేగం!

- నిమిషంలో 193 పంచ్‌లు..
- నాలుగేళ్ల ఇధికా ప్రపంచ రికార్డు
- ఏడాది సాధనతోనే అసాధారణ ఘనత
- జిల్లా టోర్నీలో స్వర్ణం.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- రెండు ప్రాంతీయ టోర్నీల్లోనూ పతకాలు



**కరీంనగర్ మహా:** బుడిబుడి అడుగులు వేసే వయసు.. బొమ్మలతో ఆడుకోవాల్సిన పసిప్రాయం.. కానీ ఆ చిన్నారి పిడికిలి బిగిస్తే పంచ్‌ల వర్షం కురుస్తుంది! సెకనుకు మూడు పంచ్‌లకు పైగా.. నిమిషం ముగిసేసరికి ఏకంగా 193 పంచ్‌లు! ప్రత్యర్థిని ఓడించాలనే లక్ష్యం కాదు.. తనలోని ప్రతిభకు హద్దుల్లేవని చాటాలనే తపన. వయసు నాలుగేళ్ల పది నెలలే.. సాధన మొదలుపెట్టి ఏడాది కూడా పూర్తికాలేదు.. అయినా ప్రపంచ రికార్డు పుటల్లో చోటు సంపాదించింది. కరీంనగర్‌కు చెందిన రావికంటి ఇధికా ఇప్పుడు ఓ చిన్నారి మాత్రమే కాదు.. అసాధారణ ప్రతిభకు చిరునామా! హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుని అందరినీ అబ్బురపరిచింది. చిన్న చేతులతో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించింది ఈ చిన్నారి. తల్లిదండ్రుల ప్రోత్సాహానికి, గురువు మార్గదర్శకత్వానికి, చిన్నారి పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం.

**నిమిషం.. 193 పంచ్‌లు!**

రికార్డు సాధించాలంటే పెద్ద వయసు, సుదీర్ఘ అనుభవం తప్పనిసరి కాదని ఇధికా నిరూపించింది. 2026 అక్టోబరు 8న కరీంనగర్‌లో నిర్వహించిన రికార్డు ప్రయత్నంలో కేవలం ఒక నిమిషంలో 193 పంచ్‌లు సంధించింది. అప్పటికి ఆమె వయసు నాలుగేళ్ల 10 నెలల 23 రోజులు మాత్రమే. ఈ ప్రదర్శనతో అత్యంత పిన్న వయసులో ఈ ఘనత సాధించిన బాలికగా గుర్తింపు పొందింది. అక్టోబరు 22న రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రం జారీ అయింది. వయసుకు మించిన వేగం.. అలసటకు తావులేని ఏకాగ్రత.. లక్ష్యంపై నిలకడైన దృష్టి.. ఇవన్నీ కలిసే ఈ అసాధారణ ప్రదర్శనకు బాటలు వేశాయి.

**ఏడాది ప్రయాణం.. విజయాల పరంపర**

ఇధికా తైక్వాండో సాధన ప్రారంభించి ఏడాది మాత్రమే అవుతోంది. అయినా ఈ కొద్దికాలంలోనే తన ప్రతిభను పోటీల వేదికపై చాటుకుంది. అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రెండు ప్రాంతీయ స్థాయి టోర్నమెంట్లలోనూ పాల్గొని పతకాలు గెలుచుకుంది. ఒకవైపు ప్రపంచ రికార్డు.. మరోవైపు పోటీల్లో పతకాలు.. ఇలా తొలి అడుగుల్లోనే విజయాల బాట పట్టింది. ఈ ఘనతలు ఆమెకు లభించిన గుర్తింపుతో పాటు భవిష్యత్తుపై ఆశలు పెంచుతున్నాయి.

**గురువు శిక్షణ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం**

ప్రతిభకు పదును పెట్టేది సాధన.. ఆ సాధనకు దిశ చూపేది సరైన మార్గదర్శకత్వం. ఇధికా కరీంనగర్‌లోని కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో తైక్వాండో శిక్షణ పొందుతోంది. తైక్వాండో శిక్షకుడు రాకేష్, మార్షల్ ఆర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మాస్టర్ రాకేష్ పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకుంటోంది. తండ్రి రావికంటి కృష్ణ సంతోష్, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఆమెకు తోడుగా నిలుస్తోంది. చిన్న వయసులోనే శిక్షణపై ఆసక్తి చూపుతూ క్రమశిక్షణతో సాధన కొనసాగించడం ఆమె విజయాలకు పునాదిగా నిలుస్తోంది

**చిన్నారి పంచ్.. ప్రపంచ రికార్డు..**

పతకం గెలవడం ఒక విజయం.. ప్రపంచ రికార్డు సాధించడం మరో మైలురాయి. అయితే ఇధికా ప్రయాణంలో కనిపిస్తున్న అసలు ప్రత్యేకత.. ఇంత చిన్న వయసులోనే క్రీడపై ఆసక్తి, సాధనపై శ్రద్ధ, లక్ష్యాన్ని చేరుకోవాలనే తపన. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు సాధిస్తారనేది ఈ చిన్నారి కృషి పట్టుదల స్పష్టం చేస్తుంది. కరీంనగర్ పేరు ప్రపంచ రికార్డు వేదికపై మార్మోగేలా చేసిన ఇధికాపై స్థానికంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో తైక్వాండోలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

నాలుగేళ్ల వయసు.. నిమిషంలో 193 పంచ్‌లు.. ఏడాది సాధనతో ప్రపంచ రికార్డు! ఇధికా పిడికిలిలో కనిపిస్తున్నది వేగమే కాదు.. రేపటి విజయాలపై ఆశ కూడా! కంగ్రాట్యులేషన్స్ ఇధికా..

# పీఎం రహత్ పథకాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్**



**హనుమకొండ, మహా ;** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎం రహత్ పథకాన్ని అర్హులైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సూచించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలని క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించేలా సహకరించాలి. ఈ పథకం కింద వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలను అందించాలని సూచించారు. ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోలీసులకు, వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు పీ.ఎం.రహత్ పథకంపై అవగాహన పెంపొందించుకుని అర్హులైన బాధితులకు ఈ పథకం ప్రయోజనాలు అందేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు




# సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ నాయకులు నూనేటి సంపత్, వంగల తిరుపతిరెడ్డి విమర్శ



**పెద్దపల్లి మహా :** కాల్వశ్రీరాంపూర్: రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి విమర్శించారు. ఆదివారం కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓవైపు విద్యుత్ కోతలు, మరోవైపు సాగునీటి కొరతతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసి ఆదుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర విద్యుత్ సరఫరా, కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి కల్పిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి పంటలను కాపాడిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రస్తుత ప్రభుత్వం విమర్శిస్తూ, ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రైతులకు తక్షణమే సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అందించి పంటలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని బిఆర్ఎస్ నాయకులు దొమ్మటి శ్రీనివాస్, కుంట శ్రీకాంత్, వడ్నాల శ్రీనివాస్, దేవయ్య, గోన సమ్మయ్య , కొట్టే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదును మరింత వేగవంతం చేయాలి

- నవంబర్ 6లోగా పట్టభద్రుల ఓటు నమోదు కావాలి
- డీసీసీ కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రం
- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి ఎండి అయూబ్,

**హనుమకొండ, మహా;** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, ఎండి అయూబ్ పిలుపునిచ్చారు. నవంబర్ 6 లోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదును చేయించాలని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆదివారం నిర్వహించిన వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశంలో ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదును సులభతరం చేసేందుకు హనుమకొండ డీసీసీ కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పట్టభద్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మండల, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు. గత ఎన్నికల కంటే ఈ సారి వర్ధన్నపేటలో రికార్డు స్థాయిలో ఓటరు నమోదు జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మండలం, డివిజన్ స్థాయి ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం

- పంటలను పరిశీలించి వ్యవసాయంపై అవగాహన పొందిన ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**పెద్దపల్లి మహా :** పుస్తకాల్లో చదివిన పాఠాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన అవగాహన కలుగుతుందని ఊషన్నపల్లి ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు.పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్ర పర్యటనలో విద్యార్థులు పసుపు, పత్తి, మిర్చి, కంది, వరి తదితర పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పంటల పెరుగుదలకు అనుకూల, ప్రతికూల పరిస్థితులు, మొక్కల భాగాలు, వాటి పెరుగుదలకు అవసరమైన పదార్థాలు, ఆహార పంటలు, వాణిజ్య పంటలు, అంతర పంటల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్ర పర్యటనలో విద్యార్థులు తెలుసుకున్న అంశాలపై చర్చించారు. ప్రత్యక్ష పరిశీలన ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అనేక విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ.. తరగతి గదిలో బోధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం వల్ల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్న విషయాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని పేర్కొన్నారు. పాఠశాల పనివేళల్లో బోధనకు ఆటంకం కలగకుండా సెలవు రోజుల్లో క్షేత్ర పర్యటనలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడ్ల స్రవంతి, బండారి సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధంతి, మృతుడి కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్



**పెద్దపల్లి మహా :** కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడి తండ్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ మునీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోన్నాయిటెంకం శివరామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, పొట్యాల మొండయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎనగంటి రవి, మహేందర్ పాల్గొన్నారు. అనంతరం సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన సారయ్య గౌడ్, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**



**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు దాసరి ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాల్వ శ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచులు బూసి సదాశివరెడ్డి, మంథని రాజయ్య, తీగల నాగరాజు, నాయకులు ఆకుల స్వామి, వివేక్ పటేల్, నిదానపురం దేవయ్య, కొట్టె రవీందర్, కామిడి వెంకట్రెడ్డి, పుప్పాల నాగార్జునరావు, గోనే శ్యాం, భైరం రమేశ్, మర్రి మహేందర్, గొడుగు మల్లయ్య, కదురు సతీశ్, జెట్టి దేవేందర్, ఒడ్నాల శ్రీనివాస్, , అనీల్, కనుకయ్య, మోహన్, నరెడ్ల సదయ్య, ఇబ్రహీం, నర్సింగం, కుంట శ్రీకాంత్, దొమ్మటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# అధికారుల నిర్లక్ష్యంతో జల వనరులకు ముప్పు...

- చెరువులో మురుగు నీరు కలుస్తున్న పట్టించుకోని జిహెచ్ఎంసి...
- చెరువును పునరుద్దించాలి...
- ఓబీసీ మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్...



**రాజేంద్రనగర్ మహా :** తొండపల్లి పెద్ద చెరువును తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్ బిజెపి నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. శంషాబాద్ డివిజన్ పరిధిలోని తొండపల్లి పెద్ద చెరువు ( పరిసర జలవనరులు) తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంది. పక్కనే ఉన్న కమర్షియల్ గోదాములు, ఫ్యాక్టరీలు స్థానిక నివాస ప్రాంతాల నుండి వస్తున్న మురుగు నీరు, రసాయన వ్యర్థాలు నేరుగా చెరువులోకి వదలడంతో జలవనరుల మనుగడకే పెద్ద ముప్పుగా మారింది. జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులో నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు.చెరువులు భూగర్భ జలాల పెరుగుదలకు, వ్యవసాయ అవసరాలకు కీలకమైన వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఈ తీవ్రమైన కాలుష్యం వల్ల ఎదురవుతున్న ప్రధాన పర్యవసానాలు భూగర్భ జలాలు విషతుల్యం అవుతున్నాయి. చెరువుల్లోకి చేరుతున్న మురుగు నీరు నిరంతరం భూమిలోకి ఇంకిపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని బోరు బావుల నీరు రంగు మారి, దుర్వాసన వస్తూ తాగునీటికి పనికిరాకుండా పోతున్నాయి. అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి, దోమలు, ఈగలు చేరి స్థానికు ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన అంటువ్యాధుల బారిన పడుతున్నారు. చెరువులోకి మురుగు నీరు, రసాయనాలు వదులుతున్న గోదాములు, ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. చెరువు చుట్టూ రక్షణ కంచె వేసి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి తొండపల్లి పెద్ద చెరువును పునరుద్ధరించాలి. 111 జీవో నిబంధనలు అమలవుతున్నాయా లేదా అనే అనుమానం కలుగుతుంది. శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. పర్యావరణ నిబంధనల అమలుపై అధికారులు పరిశీలన చేపట్టాలని బైతి శ్రీధర్ కోరారు. భారీ షెడ్లు, గోదాములు, ఇతర నిర్మాణాల నుంచి వెలువడే వ్యర్థజలాల నిర్వహణపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## పేదలకు ఇంటి స్థలాలివ్వాలి..
# ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి!

- **సత్తుపల్లి మండలంలో 3 వేల కుటుంబాలకు సొంత స్థలం కరువు**
- **ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులకు పంపిణీ చేయాలి: సీపీఎం నేత జాజిరి శ్రీనివాస్**

**సత్తుపల్లి, మహా :** మండలంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ భూములను గుర్తించి పంపిణీ చేయడంతోపాటు, ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో సుమారు 3 వేల కుటుంబాలకు సొంత ఇంటి స్థలం లేదని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆదివారం సాయంత్రం గంగారంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగారం, పాకలగూడెం, తుంబూరు, సిద్దారం, కాకర్లపల్లి, కిష్టాపురం గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన పేదలకు నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రూ.300 కోట్ల ప్రకటనను పేదల ఇళ్ల నిర్మాణానికి వినియోగించాలి ఇటీవల గంగారంలో జరిగిన సభలో పారిశ్రామికవేత్త దాసరి ఉదయ్‌కుమార్‌రెడ్డి తన సంస్థ తాన్ల సొల్యూషన్స్ తరపున రూ.300 కోట్లు అందిస్తానని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ప్రకటించిన విషయాన్ని జాజిరి శ్రీనివాస్ ప్రస్తావించారు. ఆ నిధులను నిరుపేదల గృహ అవసరాలకు వినియోగించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల పంపిణీతోపాటు, ప్రకటించిన నిధుల సహకారంతో అర్హులైన కుటుంబాలకు ఇళ్లు నిర్మించి అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సీపీఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, దేవళ్ల రామారావు, గుంటూరు జయరాజు, హసావత్ కృష్ణ, కంచి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## చెత్త పక్కన నివసించే వారి
# జీవితం దుర్భరం

- **దుర్వాసన కంపే వారి శ్వాస**
- **వైద్య పరీక్షలు మౌలిక సదుపాయాలు లేక అవస్థలు.**
- **ఇది డంపింగ్ యార్డ్ పక్కన నివసిస్తున్న కుటుంబాల జీవన వ్యధలు**

**జవహర్ నగర్, మహా :** చెత్త పక్కన నివసించే వారి జీవితం దుర్భరం... డంపింగ్ యార్డ్ పక్కనే వారి ఆవాసాలు.. దుర్వాసన చెడుగాలి మురుగు కంపే వారి శ్వాస... ఇది జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పక్కన నివసిస్తున్న గరీబోళ్ల కుటుంబాల జీవన వ్యధలు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల వద్ద డంపింగ్ యార్డ్ కు ఆనుకొని నివసించే గరీబోళ్ల కన్నీటి వ్యధలు ఇవి. దాదాపుగా 351 ఎకరాల్లో విస్తరించి ఉన్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలలో ప్రతిరోజు టన్నుల కొద్దీ వ్యర్థాలు వచ్చి చేరే క్రమంలో ఈ ప్రాంతంలో వందలాదిమంది కుటుంబాలు ఆవాసాలు మేర్పరచుకొని పొట్టకూటి కోసం కాయ కష్టం చేసుకుని నివసించే కుటుంబాలు దాదాపు 3000 కుటుంబాల వరకు ఉన్నాయి. ఈ డంపింగ్ యార్డ్ పక్కనే ఉంటున్న కుటుంబాలు నిత్యం దుర్వాసన, కంపు, చెడు ఆవాసాల మధ్య జీవనం కొనసాగిస్తున్నారు. వీరు గత 20 నుండి 30 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తూ రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లోనే జీవిస్తున్నారని తెలిపారు. వైద్య పరీక్షలు మౌలిక సదుపాయాల లేమి: నిరంతరం వెలువడే విషవాయులు కెమికల్ పొగల వల్ల ఇక్కడి పేదలు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు కిడ్నీ వైఫల్యాలు గుండెజబ్బులు చర్మవ్యాధులతో అల్లాడుతున్నారు. వీరికి సరైన వైద్య సౌకర్యాలు లేవని బాధితులు మీడియాతో మొరపెట్టుకుంటున్నారు. జీవవైవిధ్యంపై దెబ్బ: కలుషిత నీటి వల్ల కలుషిత వాతావరణంలో పరిసరాల్లోని చెరువుల్లో చేపలు చనిపోతున్నాయి, ఇక్కడి పరిస్థితుల వలన జీవవైవిధ్యం పూర్తిగా దెబ్బ తిన్నదని మేధావుల ఉవాచ. ఇకనైనా మేధావులు విద్యావేత్తలు అధికారులు ఈ జవహర్ నగర్ చెత్త సమస్య చెత్త కొండకు ఆనుకుని జీవిస్తున్న గరీబోళ్ల బ్రతుకులు మార్చాలని జవహర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.

**మురికి కూపంలో జీవిస్తున్నాం.**



జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డ్ పక్కన మురికి కూపంలో జీవిస్తున్నాం. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు మావి. ఇక్కడ ఈ చెత్త గుట్టని తీసివేసి మా జీవితాలను బాగుపరచండి.

**(ఎల్లప్ప. ఈస్ట్ నందమూరి నగర్).**

**ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది**



డంపింగ్ యార్డ్ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. డంపింగ్ యార్డ్ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, త్వరలోనే డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారం చూపుతామని ఈ విషయమై ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు. త్వరలోనే పరిష్కారం లభిస్తుంది.

**(మల్లెపూల శ్రీకాంత్ యాదవ్. చంద్రపురి కాలనీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు ).**

**పొట్టకూటి కొరకై వలస వచ్చా ము.**



మేము ఈ ప్రాంతానికి వచ్చి 20 సంవత్సరాలు దాటింది. చెత్తగుట్ట పక్కనే మా ఆవాసం. నిత్యం ముక్కు మూసుకొని జీవించాల్సి వస్తుంది. బయట ఇంటి అద్దెలు కట్టుకోలేని పరిస్థితి మాది. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తే అక్కడికి వెళ్తాం

**(శారద కర్నూలు జిల్లాలోని ఎర్రగుంటపల్లి.).**

**నరక కూపంగా పరిసరాలు**



మేముండే ప్రాంతం డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న వైయస్సార్ నగర్. మేము జీవనోపాధికై జవహర్ నగర్ వలస వచ్చాము. కూలి పని చేసుకొని జీవిస్తున్నాం. నిత్యం డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే వాసన వల్ల రోగాలపాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. ప్రభుత్వం మాకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.

**(గాదరి. స్వామి. వైయస్సార్ నగర్).**



# డీసీఎం ఢీకొని మహిళా మృతి..

**మొయినాబాద్ మహా:** కూతురిని చూడడానికి వెళ్లి తిరిగి వస్తున్న తల్లి బస్సు కోసం ఎదురు చూస్తున్న సమయంలో డీసీఎం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గొడుగు నాగమణి వయస్సు (50) గృహిణి, ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో అజీజ్ నగర్ లోని తన కూతురిని చూడడానికి వెళ్ళింది. తిరిగి 10గంటల సమయంలో చిలుకూరు గ్రామానికి రావడానికి అజీజ్ నగర్ చౌరస్తాలో బస్సు కోసం ఎదురుచూస్తుండగా.. అదే సమయంలో హైదరాబాద్ నుండి చేవెళ్ల వైపు వెళ్తున్న టీఎస్ 15 యూడీ 0427 నంబర్ గల డీసీఎం అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆమెను ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోవడంతో తలకు, ఛాతీ భాగంలో బలమైన గాయాలతో అక్కడిక్కడే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




# పట్టభద్రుల చూపు కాంగ్రెస్ వైపే!

**పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు**

**హనుమకొండ, మహా ;** హనుమకొండ నగరంలోని న్యూ శాయంపేట 31వ డివిజన్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు తో కలిసి తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. గత పది సంవత్సరాల్లో జరగని ఎన్నో అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే చేపడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా బత్తిని శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్చార్జి మార్క విజయ్ డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్, మాజీ అధ్యక్షులు, డివిజన్ ఎమ్మెల్సీ ఇన్చార్జి మామిండ్ల సురేష్, పట్టభద్రులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**వరంగల్, మహా :** వరంగల్ లోని మున్నూరు కాపు పరపతి సంఘం ఫంక్షన్ హాల్ లో లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్ సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా సంఘం అధ్యక్షులు ఆకు తోట రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్ పదవ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అధ్యక్షులు ఆకుతోట రాజు కు, కార్యవర్గ సభ్యులకు, 51 మంది సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంఘాల ఐక్యతతో కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండటమే కాకుండా, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలుస్తూ నష్టాల్లోనూ, కష్టాల్లోనూ భాగస్వాములయ్యే గొప్ప అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది సభ్యులకు మూడు గ్రాముల బంగారు నాణేలు అందించడం అభినందనీయమని, వచ్చే ఏడాది ప్రతి సభ్యునికి తులం బంగారం అందించే స్థాయికి సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆటో ట్రాలీ డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక ఆటో అడ్డా స్థలం, కార్మికులకు బీమా సదుపాయాలు, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి ఆటో ట్రాలీ యూనియన్ అధ్యక్షులు ఆకుతోట రాజు, కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాయికపోడు సేవా సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి లోని లక్ష్మీ భవాని గార్డెన్ లో ఆదివారం నాయికపోడు సేవా సంఘం (రిజిస్ట్రేషన్ నెం. 1082/93) మంచిర్యాల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు మేసినేని రాజన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ జిల్లా అధ్యక్షులుగా లౌడం రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మేసినేని అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా తైనేని రవి, అధికార ప్రతినిధిగా ఎదుల రాయమల్లు, ఉపాధ్యక్షులుగా మంగురపు రమేష్ లను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మేసినేని రాజన్న మాట్లాడుతూ రాష్ట్రంలో నాయికపోడు జనాభాను కేవలం 5000 గా చూపించడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం నాయికపోడు కులానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేస్తూ, 2027లో జరగబోయే కులగణనలో సమగ్ర సర్వే నిర్వహించి జాతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయి



కపోడు కులస్తులందరూ జాతి అభివృద్ధికి ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ల రామ్ చందర్, సలహాదారు బండారి బోజన్న, పల్ల సత్యనారాయణ, పెద్ది రాజన్న, ఉపాధ్యక్షులు జనగామ భీముడు, జెక్క శేఖర్, కోశాధికారి దైనేని రమేష్, ఉద్యోగ సంఘం ప్రతినిధి పెద్ది సత్తన్న, సీనియర్ నాయకులు, అన్ని మండలాల, గ్రామాల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

- **రూ. 2 కోట్లతో నిర్మించిన గిరిజన బాలికల నూతన వసతి గృహం**
- **ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి, వరంగల్ జిల్లా కలెక్టర్**

**నర్సంపేట, మహా ;** నర్సంపేట పట్టణంలో గిరిజన బాలికల సౌకర్యార్థం రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన గిరిజన బాలికల వసతి గృహాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ, నర్సంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గదులు సరిపోకపోవడాన్ని గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను పరిష్కరించి, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రూ. 2 కోట్ల వ్యయంతో నూతన వసతి గృహాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం గిరిజన బాలికల వసతి గృహంలో సుమారు 300 మంది విద్యార్థినుల వసతికి వీలు గా ఈ వసతి గృహాన్ని నిర్మించడం జరిగిందని, దాదాపు 260 మంది ప్రస్తుతం వసతి పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వసతి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా వారికి అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు వసతి పరంగా ఇబ్బందులు తగ్గి, చదువుపై మరింత దృష్టి సారించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినులు కళాశాల విద్యలో రాణించేందుకు , వసతి గృహాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు.

**వసతి, నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, సౌకర్యవంతమైన వాతావరణంలో వసతి సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధికి వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటే వారు చదువుపై ఏకాగ్రత పెంచుకొని విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో నూతన వసతి గృహం అందుబాటులోకి రావడం విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నారాయణ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ, ఏటూరునాగారం ఎ. ప్రవీణ, డిప్యూటీ ఈ.ఈ, కొత్తగూడ డివిజన్ ఎ. దేవిశ్రీ, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శిగా దేవునూరి రాజు

**వరంగల్, మహా ;** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా, వరంగల్ నగరంలోని లేబర్ కాలనీకి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త దేవునూరి రాజును వరంగల్ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవునూరి రాజు 2012 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ, తెలంగాణ ధూంధాం, తెలంగాణ ఆట-పాట-మాట, తెలంగాణ లడాయి వంటి కార్యక్రమాల ద్వారా ఉద్యమానికి తన వంతు కృషి చేశారు. ఈ కార్యక్రమాల్లో యువత, మహిళలు, పెద్దలను భాగస్వాములను చేస్తూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. తన పై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్, కన్వీనర్ వాడపల్లి



శ్యామ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎం.డి. చాంద్ పాషా, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశోక్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# పోలీసు అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

**పెద్దపల్లి మహా :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జండా చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు ఆత్మశాంతి కలగాలని నాయకులు ఆకాంక్షించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం చేస్తున్న సేవలను కొనియాడారు. పోలీసు సిబ్బందికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని పెద్దపల్లి ఎస్సై రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బుధగడ్డ సంపత్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, భూషణ వేణు, సురేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీష్, కమల్, నాంసాని శ్రీనివాస్, నదీమ్, అస్లాం, యాప అష్రఫ్, సల్మాన్, అదిల్, గంగుల వెంకటేశం, అమర్శెట్టి సతీష్, బొంకురి నరసయ్య, మారుపాటి రవి, చంద్రగిరి శ్రీనివాస్, భీమోజు సురేందర్, పిల్లి రమేష్, రవి, రమేష్, పురేళ్ల సుధాకర్, నక్క సంతోష్, నూనె పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన పెద్దపల్లి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**బెల్లంపల్లి, మహా:** పట్టణంతోపాటు మండలంలోని పల్లి గ్రామంలో సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు మృతి చెందడంతో బాధిత కుటుంబాలను ఆదివారం నాడు పెద్దపల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ పరామర్శించి ఓదార్చారు. బట్వాన్పల్లికి చెందిన సింగతి సత్తన్న తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సింగతి సత్తన్నని, వారి కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలు కుటుంబ పరిస్థితులను, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఆ లోటు ఎవరూ తీర్చలేనిదని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. పరామర్శలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి మాజీ చైర్మన్ సూరిబాబు సోదరుడు చంద్రశేఖర్ ను పరామర్శించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ఓదార్చారు. మృతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు, వారి కుటుంబాలకు కష్టసుఖాల్లో అండగా నిలవడం తన బాధ్యత అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు





# పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదు

- పదవి గొప్ప కాదు ఆ పదవికి ఎంత మేర న్యాయం చేస్తున్నామనేదే ముఖ్యం.
- రేవంత్ కాలగర్భంలో కలిసిపోతావా? ప్రజల మధ్య ఉంటావా తేల్చుకో?
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.

**జవహర్ నగర్, మహా:** పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదని పదవులు గొప్ప కాదని ఆ పదవికి న్యాయం చేస్తున్నామని ముఖ్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డ్ వల్ల కాలుష్య నియంత్రణకు శాశ్విత పరిష్కారం కోసం హైదరాబాద్ టూరిజం హోటల్లో పర్యావరణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడుతూ, మేధావులు పర్యావరణవేత్తలు డంపింగ్ యార్డ్ వల్ల ఎదుర్కొంటున్న బాధలను వివరించారు. జవహర్ నగర్ లో గరీబోళ్ళు ప్రాణాలు అరచేతుల పెట్టుకొని జీవిస్తున్నారని ఈ విషయమై కంచె చేను మేసినట్టు పాలకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు చట్టాల మీద నమ్మకం పోతుందని రామ్కి డబ్బు పలుకుబడితో కోర్టులు ఇచ్చిన తీర్పులను కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు.ఇటీవలే జవహర్ నగర్ లో కుక్కలు ఒక బాబును పీక్కొని తిన్న ఘటన మరువలేమని తెలిపారు. రాంకి సిఎస్ఆర్ డబ్బులు ఇక్కడ తాగునీరు రోడ్లు ప్రజలకు ఖర్చు చేయకుండా వేరే రాష్ట్రాల్లో ఖర్చుపెడుతుందన్నారు. మేము మొదటగా కలిసింది సీఎం రేవంత్ రెడ్డిని జవహర్ నగర్ ప్రజల కోసమేనని తెలిపారు. ప్రశ్నించే గొంతుక అధికారాన్ని చేపట్టావు కానీ దీనిని పరిష్కారం చేయాలని కోరితే మీరే మీటింగ్ పెట్టండి అని చెప్పావు కానీ కానీ ఇంతవరకు ఈ విషయమై చిత్తశుద్ధి లేకపోవడం దారుణమన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య గురించి పార్లమెంటులో మాట్లాడాలని కేంద్రమంత్రి కట్టర్ ను కలిసి వివరించానని తెలిపారు. ఢిల్లీలో కోట్ల టన్నుల చెత్తను రీసైకిల్ చేస్తున్నారు చెత్తను ఎలక్ట్రిసిటీ జనరేషన్ బయోగ్యాస్ ఆర్గానిక్ మెన్యూర్ గా చేయవచ్చునని అలాంటి ప్లాంటు పెట్టండి అని సూచించారు. చెత్త ఏరుకునేవాళ్లు మా దగ్గరికి వచ్చి రామ్కీ చెత్త కూడా ఏరుకొనివ్వ కుండా ఆ పని కూడా వాళ్లే చేస్తారట డబ్బులు సంపాదించుకో కానీ ఇలా సంపాదించకు అని తెలిపారు. ఈ పరిణామాలు నిరసిస్తూ ఈనెల 27వ తేదీ నుండి పాదయాత్ర మొదలు పెడుతున్నానని తెలిపారు. రాజకీయంలో పదవి గొప్ప కాదని ఆ పదవికి ఎంత న్యాయం చేస్తున్నామన్నదే ముఖ్యమని రేవంత్ రెడ్డి ఇకనైనా మేల్కొని డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారం చూపించాలనీ లేకపోతే కాలగర్భంలో కలిసిపోతావని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంపీఎస్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్, కేశపాక రామచంద్ర, నరసింహారావు, శ్రీకృష్ణ, వంద్రపల్లి శివ, వెంకటేశ్వర్లు, మేధావులు, ప్రొఫెసర్లు, జిహెచ్ఎంసి మాజీ మేయర్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# కృత్రిమ కొరత సృష్టిస్తున్న బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- ఎల్ ని నో "సాకుతో బియ్యం అడ్డగోలుధరలు
- రైస్ మిల్లులపై టాస్క్ ఫోర్స్ అధికారులు పౌరసరపర శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి
- ఎం సి పి ఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్

**బెల్లంపల్లి, మహా:** ఎల్నినో సాకుతో సన్న బియ్యం అడ్డగోలు ధరలు పెంచడానికి కృత్రిమ కొరత సృష్టిస్తున్న బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలనీ,రైస్ మిల్లులపై టాస్క్ ఫోర్స్ అధికారులు, పౌరసరఫరాల శాధికారులు చర్యలు తీసుకోవాలని ఎం సి పి ఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు.ఆదివారంరోజు ఎంసీపీఐయు పార్టీ కార్యాలయం లో ఎం సి పి ఐ యూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ మార్కెట్లో ఎల్ ని నో వాతావరణ పరిస్థితులను సాకుగా చూపిస్తూ, సాధారణ ప్రజల ప్రధాన ఆహారమైన బియ్యం ధరలను అడ్డగోలుగా పెంచి విక్రయించడాన్ని ఎం సి పి ఐ యు పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందనీ, ప్రకృతి వైపరీత్యాన్ని సాకుగా మార్చుకొని కొంతమంది స్వార్థపర వ్యాపారులు బియ్యం నిల్వలను అక్రమంగా దాచి ఉంచి బ్లాక్ మార్కెట్ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సాధారణ మధ్యతరగతి, పేద ప్రజలు కొనుగోలు చేసే సన్నబియ్యం ధరలను సైతం కిలోకు 60 రూపాయల నుండి 95 రూపాయల వరకు పెంచి సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నారని ఎల్ ని నో వల్ల దిగుబడి తగ్గిన మాట వాస్తవమే అయినప్పటికీ దానిని ఆసరాగా చేసుకొని బ్లాక్ మార్కెట్ కేటు గాళ్లు చేస్తున్న దోపిడీకి హద్దు అదుపు లేకుండా పోయిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బియ్యం హోల్సేల్ వ్యాపార కేంద్రాలు, మిల్లులపై టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాం అక్రమ నిల్వలను బయటకు తీసి నియంత్రిత ధరకు బియ్యం లభించేలా చూడాలని లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, సంబోధి రాజేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్నాబ్ తుఫాన్ ముప్పును సమర్థంగా ఎదుర్కొందాం

**అమరావతి, మహా:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్నాబ్' తుఫాన్‌గా బలపడి రాష్ట్రానికి పెనుముప్పుగా మారుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన తుఫాన్ ప్రభావం, ముందస్తు సన్నద్ధతపై సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికలతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో సహాయక చర్యల కోసం ఇప్పటికే 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని సీఎం తెలిపారు. అక్టోబరు 28వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల విశాఖపట్నం మధ్య లేదంటే కోనసీమ యానాం కాకినాడ తీర ప్రాంతాల మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా సుమారు 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వెల్లడించారు. వాతావరణ పరిస్థితుల తీవ్రతను బట్టి అక్టోబరు 26వ తేదీ ఉదయానికి ఇది తుఫాన్‌గా, అదే రోజు రాత్రికి తీవ్ర తుఫాన్‌గా, 27 నాటికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడే ప్రమాదం ఉందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, కొన్ని సందర్భాల్లో ఏకంగా 140 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలి..

- ఓటరు నమోదు, ప్రచారంపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**మణుగూరు, మహా :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు, ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మందులు బొంగులేటి ఆధ్వర్యంలో నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదే కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గాల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకుని ఓటరు జాబితాల పరిశీలన, నమోదు ప్రక్రియ, ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా యువ పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతలో ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పాయం సూచించారు. ఓట్ బచావో-దేశ్ బచావో కార్యక్రమం ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ మేడి వెంకటేశ్, పీసీసీ కోఆర్డినేటర్ దుద్దిళ్ల శ్రీనుబాబు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరెం కనకయ్య, జారే ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# మిఠాయి ప్రియులకు షాక్

- రాష్ట్రవ్యాప్తంగా స్వీట్ షాపులపై 'టీజీ సేఫ్' ఉక్కుపాదం!
- కల్తీ స్వీట్ల తయారీపై ఆకస్మిక తనిఖీలు.
- 38 నమూనాల సేకరణ, నిబంధనలు ఉల్లంఘించిన 20 సంస్థలకు నోటీసులు!

హైదరాబాద్, మహా : రాష్ట్రంలో ప్రజలు ఎంతో ఇష్టంగా ఆరగించే మిఠాయిల నాణ్యతపై 'టీజీ సేఫ్' అధికారులు తీవ్ర దృష్టి సారించారు. మార్కెట్లో కల్తీ స్వీట్లను విచ్చలవిడిగా తయారు చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ స్వీట్ షాపులు, స్వీట్ల తయారీ కేంద్రాలపై అధికారులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా అనేక కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా, అపరిశుభ్ర వాతావరణంలో మిఠాయిలు తయారు చేస్తుండటాన్ని అధికారులు గుర్తించారు.ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా కల్తీపై తీవ్ర అనుమానంతో మొత్తం 38 రకాల ఆహార పదార్థాల నమూనాలను అధికారులు సేకరించారు. వీటిని నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రత్యేక ల్యాబ్‌లకు తరలించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి, అపరిశుభ్ర పరిస్థితుల్లో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించిన 20 సంస్థలకు అధికారులు తక్షణమే ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. అలాగే మరికొన్ని స్వీట్ షాపులకు షోకాజు నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. ప్రజల ప్రాణాలతో, ఆరోగ్యంతో చెలగాటమాడేలా నాణ్యతా ప్రమాణాలు పాటించని ఏ సంస్థను ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# 'సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' నినాదంతో ఢిల్లీలో మెగా ర్యాలీ

**న్యూఢిల్లీ, మహా :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడే లక్ష్యంతో 'సేవ్ ది వోట్ సేవ్ ది కంట్రీ' నినాదంతో నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో భారీ 'జన్ మార్చ్ అండ్ మెగా ర్యాలీ'ని నిర్వహించనున్నట్లు లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన అధికారికంగా వెల్లడిస్తూ, దేశ ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ చారిత్రాత్మక ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గళం విప్పాలని రాహుల్ గాంధీ కోరారు. దేశంలో అధికారంలో ఉన్నవారు ఓటర్ల జాబితాల నుంచి పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని, రాజ్యాంగ నిబంధనలను, చట్టాలను నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన వారిపై లాఠీలతో దాడులు చేస్తూ అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. "ఓటు మీది.. పోరాటం కూడా మీదే" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, రాబోయే ఏడు రోజుల పాటు ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని సూచించారు




# విపత్తులపై కూడా బీఆర్ఎస్ సంకుచిత రాజకీయాలు చేస్తోంది.

- ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర విమర్శలు!

**హైదరాబాద్, మహా :** ప్రకృతి విపత్తులు మరియు క్లిష్ట పరిస్థితుల వేళ కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం తగదని కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విపత్తుల ప్రభావాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ నేతలు కేవలం రాజకీయ లబ్ధి కోసం 'జాలీ ట్రిప్'గా మేడిగడ్డ పర్యటనకు వెళ్లారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం లక్ష కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని, హైదరాబాద్ నీటి అవసరాల కోసం మేడిగడ్డ నుంచి ఇప్పటివరకు ఒక్క టీఎంసీ నీరు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు.హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చర్యలను దానం నాగేందర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో గోదావరి నది, ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ కోసం 10 టీఎంసీల నీటిని తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒక పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని, దీనిలో భాగంగా 2027 జనవరి నాటికి నగరానికి మరో 5 టీఎంసీల నీరు రాబోతోందని ఆయన వెల్లడించారు.

ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా దానం నాగేందర్ విమర్శలు గుప్పించారు. బీహార్, బెంగాల్, యూపీ వంటి రాష్ట్రాలలో ఓట్లను తొలగించడం ద్వారానే బీజేపీ అక్రమంగా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న మెగా ర్యాలీలో దేశంలోని ప్రతి ఒక్కరూ పాల్గొని 'ఛలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# భోగాపురం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు ప్రారంభం.

- మూడేళ్ల విరామం తర్వాత అందుబాటులోకి సేవలు!

**భోగాపురం ,మహా :** విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి విమాన సర్వీసులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ విమానయాన సంస్థ 'ఆకాశ ఎయిర్‌లైన్స్' ఈ సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. సుమారు మూడేళ్ల విరామం తర్వాత భోగాపురం నుంచి ఢిల్లీకి నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కావడంతో స్థానిక ప్రయాణికుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ప్రత్యేక ప్రారంభ రోజున ఢిల్లీకి వెళ్లే ప్రయాణికులతో తొలి విమానం ఉత్సాహంగా బయలుదేరింది .ఈ విమాన సర్వీసుల ప్రారంభంతో భోగాపురం, విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి ఢిల్లీకి ప్రయాణించాలనుకునే వారికి ఎంతో ఊరట లభించనుంది. రాజధానికి వెళ్లే వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, పర్యాటకులకు ఈ విమాన సేవలు అత్యంత ఉపయోగకరంగా మారనున్నాయి. గంటల కొద్దీ ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు, అత్యంత సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాన్ని చేరుకునే అవకాశం లభిస్తోంది. ముఖ్యంగా అధికారిక పనులు, వ్యాపార సమావేశాలు మరియు ఇతర అత్యవసర అవసరాల నిమిత్తం తరచూ ఢిల్లీకి రాకపోకలు సాగించేవారికి ఈ నేరుగా నడిచే సర్వీసులు ఎంతగానో దోహదపడతాయి.భోగాపురం నుంచి ఢిల్లీ వంటి ప్రధాన నగరానికి విమాన సదుపాయం అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణికులు తమ ప్రయాణాలను మరింత సులువుగా ప్రణాళికాబద్ధంగా జరుపుకోవచ్చు. విమాన సర్వీసుల నిర్వహణ వేళలు, టికెట్ ధరలు, రాకపోకల షెడ్యూల్ వంటి వివరాలు ప్రయాణికులకు కీలకం కానున్నాయి. మూడేళ్ల విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన ఈ విమాన సేవలు భోగాపురం కేంద్రంగా విమానయాన రంగానికి మరింత ఊతమిస్తాయని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నారు.



# సీఎం రేవంత్ అండతోనే మంచిర్యాల ఎమ్మెల్యే అరాచకాలు

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆరోపణ**

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండతోనే మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అరాచకాలకు పాల్పడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో గత కొద్ది రోజులుగా మంచిర్యాల ఎమ్మెల్యే వర్గం, మంత్రి వివేకానంద వర్గం మధ్య జరుగుతున్న దాడులు, శాంతి భద్రతల విఘాతంపై ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మంచిర్యాల జిల్లాలో ప్రతిపక్ష పార్టీల నాయకులపై, వ్యాపారస్తులపై దాడులు జరుగుతున్నా, అక్రమ కేసులు పెడుతున్నా ముఖ్యమంత్రి, పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యువతను గంజాయి, డ్రగ్స్ కు బానిస చేసి దాడులను ప్రేరేపిస్తున్నారని, హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి డబ్బులు వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ శాంతి భద్రతలపై లేదని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాలలో భూ కబ్జాలు, దాడులు, వసూళ్లు చేసి ఇప్పుడు వర్గాలుగా విడిపోయి జిల్లాలో అలజడి సృష్టిస్తున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలలో కాంగ్రెస్ నాయకులు వర్గాలుగా విడిపోయి దాడులు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు.గత వారం రోజులుగా ఎప్పుడూ ప్రజా ప్రతినిధి కాని వ్యక్తికి 300 మంది పోలీసు బలగాలతో రక్షణ కల్పించారని, ఎవరి అండతో బలగాలు మోహరించారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గాజుల ముఖేష్‌గౌడ్ ఉన్నారు.

# అర్నాబ్ తుఫాన్ ముప్పును సమర్థంగా ఎదుర్కొందాం

**అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : సీఎం చంద్రబాబు.**

**అమరావతి, మహా :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్నాబ్' తుఫాన్‌గా బలపడి రాష్ట్రానికి పెనుముప్పుగా మారుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన తుఫాన్ ప్రభావం, ముందస్తు సన్నద్ధతపై సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికలతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో సహాయక చర్యల కోసం ఇప్పటికే 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని సీఎం తెలిపారు. అక్టోబరు 28వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల విశాఖపట్నం మధ్య లేదంటే కోనసీమ యానాం కాకినాడ తీర ప్రాంతాల మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని ఆయన వివరించారు. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా సుమారు 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వెల్లడించారు. వాతావరణ పరిస్థితుల తీవ్రతను బట్టి అక్టోబరు 26వ తేదీ ఉదయానికి ఇది తుఫాన్‌గా, అదే రోజు రాత్రికి తీవ్ర తుఫాన్‌గా, 27 నాటికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడే ప్రమాదం ఉందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, కొన్ని సందర్భాల్లో ఏకంగా 140 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. అక్టోబరు 27వ తేదీ ఉదయం నుంచే తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరుగుతుందని, ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.ముఖ్యంగా కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలోని ఇతర ప్రాంతాలపై తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు.

## రాజకీయాల్లోకి ధనుష్.. చెన్నైలో మహిళా అభిమానులతో
# కీలక భేటీ!

తమిళ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ధనుష్ చుట్టూ ఇప్పుడు రాజకీయ చర్చలు మొదలయ్యాయి. ఇప్పటికే విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో, ఇతర సినీ ప్రముఖుల రాజకీయ అడుగులపై కూడా ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో ధనుష్ తన అభిమాన సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా చెన్నైలో తన అభిమాన సంఘానికి చెందిన మహిళా విభాగం ప్రతినిధులతో ఆయన సమావేశం కానున్నట్లు వార్తలు వెలువడ్డాయి. తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు సమాచారం. అభిమాన సంఘాన్ని 'ధనుష్ నర్పణి ఇయక్కం' పేరుతో సంక్షేమ సంస్థగా రూపుదిద్దడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి అంశాలు ఈ పరిణామాలకు నేపథ్యంగా నిలుస్తున్నాయి. అభిమానులను కేవలం సినిమా వేడుకలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలనే ఆలోచనతో ఈ సంస్థ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం కూడా ఊపందుకుంది. ఇటీవల ఆయన అభిమాన సంఘం కార్యకలాపాల్లో మార్పులు చేయడం, నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించడం, సంస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టడం ఈ ఊహాగానాలకు కారణమవుతున్నాయి. అయితే ధనుష్ ఇప్పటివరకు రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు గానీ, ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు గానీ అధికారికంగా ప్రకటించలేదు. అభిమాన సంఘం ద్వారా సామాజిక సేవ చేయడం, రాజకీయాల్లోకి ప్రవేశించడం రెండూ వేర్వేరు అంశాలు కావడంతో ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. తమిళనాడులో సినీ ప్రముఖులకు ఉన్న అభిమాన బలం రాజకీయాల్లోనూ ప్రభావం చూపగలదని విజయ్ విజయం మరోసారి చర్చకు తెచ్చింది. ఈ నేపథ్యంలో ధనుష్ తన అభిమాన సంఘాన్ని ఏ దిశగా నడిపిస్తారు? మహిళా విభాగం సమావేశంలో ఏమైనా కీలక ప్రకటన చేస్తారా? అన్న ఆసక్తి నెలకొంది. ప్రస్తుతానికి ఆయన రాజకీయ ప్రవేశంపై వస్తున్న వార్తలు ఊహాగానాలకే పరిమితమయ్యాయి. ధనుష్ నుంచి అధికారిక ప్రకటన వెలువడితేనే ఆయన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# చీరకట్టులో శ్రావ్య చౌదరి..

ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొత్త పోకడలు వస్తున్నప్పటికీ, సంప్రదాయ చీరకట్టుకు ఉండే ప్రత్యేకత మాత్రం ఎప్పటికీ తగ్గదు. ముఖ్యంగా సాధారణమైన చీరలోనూ అందంగా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకునే కథానాయికలు ఎంతోమంది ఉన్నారు. తాజాగా శ్రావ్య చౌదరి తన సింపుల్ చీరకట్టుతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. హంగులు, ఆర్భాటాలకు దూరంగా సాదాసీదా వస్త్రధారణతో కనిపిస్తూ సంప్రదాయ అందానికి మరో రూపాన్ని చూపిస్తున్నారు. చక్కగా కట్టిన చీర, దానికి తగిన బ్లౌజ్, మితమైన ఆభరణాలతో ఆమె లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భారీ మేకప్, ఆకర్షణీయమైన డిజైనర్ దుస్తుల కంటే సహజమైన అలంకరణకే ప్రాధాన్యం ఇస్తే అందం మరింత ఇనుమడిస్తుందని ఆమె ఫొటోలు గుర్తుచేస్తున్నాయి. చీరకట్టులో కనిపించే నిండుదనం, సంప్రదాయ శైలి ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పండుగలు, కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలకు సింపుల్ చీరకట్టు ఎంచుకోవాలనుకునే వారికి ఈ తరహా లుక్ మంచి ప్రేరణగా నిలుస్తుంది. చీర రంగుకు అనుగుణంగా ఆభరణాలు, జుట్టు అలంకరణను ఎంపిక చేసుకోవడం ద్వారా అందమైన రూపాన్ని సొంతం చేసుకోవచ్చనే విషయాన్ని ఈ ఫొటోలు చాటుతున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెలబ్రిటీల సంప్రదాయ వస్త్రధారణకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆధునిక దుస్తులతో పాటు చీరల్లోనూ తమ ప్రత్యేకతను చూపించేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రావ్య చౌదరి సింపుల్ చీర లుక్ ఫ్యాషన్ అభిమానులను ఆకట్టుకుంటోంది. తక్కువ అలంకరణతోనూ ప్రత్యేకంగా కనిపించవచ్చని చాటి చెబుతున్న ఆమె సంప్రదాయ శైలి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.






# సంగీతాభిషేకం..
## 'రంగులు రంగులే' పాట విడుదల!

భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రామాయణ' నుంచి తాజాగా 'రంగులు రంగులే' పాట విడుదలైంది. రాముడు, సీతల మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని, వారి జీవితంలోని మధురమైన ఘట్టాలను అందంగా ఆవిష్కరిస్తూ ఈ పాట ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. పాటలో వీరిద్దరి జంట, సంప్రదాయ వస్త్రధారణ, ఆహ్లాదకరమైన దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీతాస్వయంవరం నుంచి రామసీతల వివాహం వరకు, అయోధ్యలోని ఆనందకరమైన క్షణాల నుంచి అరణ్యవాసంలో ఎదురయ్యే భావోద్వేగాల వరకు పలు ఘట్టాలను ఈ పాటలో చూపించారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి తమ హావభావాలతో పాత్రలకు జీవం పోశారు. వీరిద్దరి మధ్య కనిపించే అనుబంధం పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఈ పాటకు స్వరాలు సమకూర్చగా, రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ ఆలపించారు. రాకేందు మౌళి తెలుగు సాహిత్యాన్ని అందించారు. మధురమైన సంగీతం, భావోద్వేగభరితమైన సాహిత్యం, అద్భుతమైన దృశ్యాల కలయికతో పాట ఆకట్టుకుంటోంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తూ రామసీతల బంధంలోని ప్రేమ, నమ్మకం, త్యాగం వంటి భావాలను ప్రేక్షకులకు చేరువ చేసే ప్రయత్నం చేశారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్‌తో పాటు హాన్స్ జిమ్మర్ సంగీతంలో భాగస్వాములుగా ఉన్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంలో యశ్ రావణుడిగా, రవీ దూబే లక్ష్మణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న 'రామాయణ' తొలి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రామసీతల ప్రేమకథను మరోసారి ప్రేక్షకులకు గుర్తుచేస్తోంది.



## కాల్పుల ఘటన తర్వాత టైగర్ ష్రాఫ్ కీలక నిర్ణయం..
### రూ.9 కోట్లకు ముంబై ఫ్లాట్ విక్రయం

బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్ పేరు ప్రస్తుతం ఓవైపు కాల్పుల ఘటనతో, మరోవైపు ఆయన రియల్ ఎస్టేట్ లావాదేవీతో వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల ముంబైలో ఆయన కారుపై కాల్పులు జరిగిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం జరిగిన కొద్ది రోజులకే టైగర్ ష్రాఫ్ తనకు చెందిన ఓ అపార్ట్‌మెంట్‌ను రూ.9 కోట్లకు విక్రయించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ రెండు ఘటనలకు పరస్పర సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు లేవు. ముంబైలోని ఖార్ వెస్ట్ ప్రాంతంలో ఉన్న రుస్తోంజీ పారామౌంట్ నివాస సముదాయంలోని తొమ్మిదో అంతస్తులో ఈ ఫ్లాట్ ఉంది. అక్టోబర్ 22న ఈ విక్రయ ఒప్పందం రిజిస్టర్ అయినట్లు ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా వెల్లడైంది. ఈ అపార్ట్‌మెంట్‌ను టైగర్ 2018 జూలైలో సుమారు రూ.7.61 కోట్లకు కొనుగోలు చేశారు. 2019 నవంబర్‌లో ఆయనకు ఆస్తి స్వాధీనం లభించింది. తాజాగా రూ.9 కోట్లకు విక్రయించడంతో కొనుగోలు ధరతో పోలిస్తే సుమారు రూ.1.39 కోట్ల వ్యత్యాసం కనిపిస్తోంది. అయితే ఇందులో పన్నులు, రిజిస్ట్రేషన్ ఖర్చులు, ఇతర వ్యయాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ఒప్పందంలో రెండు కార్ల పార్కింగ్ స్థలాలు కూడా ఉన్నాయి. మరోవైపు, అక్టోబర్ 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారుపై దుండగులు కాల్పులు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో టైగర్ సురక్షితంగా బయటపడగా, ఆయన డ్రైవర్, మరో వ్యక్తి గాయపడినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాల్పుల ఘటన జరిగిన నాలుగు రోజులకే ఫ్లాట్ విక్రయం నమోదు కావడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ విక్రయం ముందుగా తీసుకున్న వ్యాపార నిర్ణయమా, లేక ఇటీవలి పరిణామాలతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపై స్పష్టత లేదు. టైగర్ ష్రాఫ్ నుంచి కూడా దీనిపై అధికారిక వివరణ వెలువడలేదు. ప్రస్తుతం ఈ ఆస్తి విక్రయం, కాల్పుల ఘటన రెండూ బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## హీరోగా దేవిశ్రీ ప్రసాద్.. 'ఎల్లమ్మ'తో కొత్త ప్రయాణం ప్రారంభం!



టాలీవుడ్‌లో తనదైన సంగీతంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఇప్పుడు నటుడిగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇన్నాళ్లూ తన పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డీఎస్పీ.. త్వరలో హీరోగా కొత్త అవతారం ఎత్తబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. జాతీయ అవార్డు గ్రహీత వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'ఎల్లమ్మ' చిత్రంతో ఆయన కథానాయకుడిగా పరిచయం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బలగం' సినిమాతో ప్రేక్షకుల మనసులను గెలుచుకున్న వేణు యెల్దండి, ఈసారి తెలంగాణ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద నేపథ్యంతో కూడిన కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కథకు దేవిశ్రీ ప్రసాద్ రూపం సరిపోతుందని భావించి ఆయనను హీరోగా ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, సినిమా గురించి వెలువడుతున్న వివరాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా సంగీత దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు పనిచేసిన డీఎస్పీ, నటుడిగా తనను తాను ఎలా నిరూపించుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. దేవిశ్రీ ప్రసాద్‌కు నటన కొత్తేమీ కాదు. గతంలో కొన్ని సినిమాల్లో ప్రత్యేక పాత్రల్లో కనిపించినప్పటికీ, పూర్తి స్థాయి కథానాయకుడిగా సినిమా చేయడం మాత్రం ఆయన కెరీర్‌లో కీలక మలుపు కానుంది. సంగీతంతో ప్రేక్షకులను అలరించిన ఆయన, ఈసారి తన నటనతోనూ అభిమానులను మెప్పించాలని భావిస్తున్నారు. మరోవైపు 'ఎల్లమ్మ' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ దిల్ రాజు నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా కథ, పాత్రల రూపకల్పన, సంగీతానికి సంబంధించిన అంశాలపై చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జానపద కళలు, గ్రామీణ జీవనశైలి, స్థానిక సంస్కృతిని కథలో ప్రధానంగా చూపించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సినిమా విడుదల తేదీ, ఇతర నటీనటులు, పూర్తి సాంకేతిక బృందం వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సంగీత దర్శకుడిగా ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు సంపాదించిన దేవిశ్రీ ప్రసాద్ హీరోగా ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి. 'ఎల్లమ్మ' ఆయన కెరీర్‌కు కొత్త దిశను చూపిస్తుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## ప్రియదర్శి 'ఇడుపు కాయితం' పాటపై ట్రోలింగ్.. నెట్టింట వైరల్‌గా మారిన కామెంట్స్



విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం' ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన పాట విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు ట్రోలింగ్ చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా హాస్య పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరైన ప్రియదర్శి, ఇప్పుడు భిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రచారంలో భాగంగా విడుదల చేసిన పాటపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. పాటలోని సాహిత్యం, సంగీతం, చిత్రీకరణపై కొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, మరికొందరు సరదా వ్యాఖ్యలతో ట్రోల్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఏదైనా కొత్త పాట విడుదలైతే దానిపై ప్రశంసలు, విమర్శలు రెండూ రావడం సాధారణంగా మారింది. 'ఇడుపు కాయితం' పాట విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఈ ట్రోలింగ్ కారణంగా సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతుందా? లేక ప్రచారానికి ప్రతికూల ప్రభావం చూపుతుందా? అనేది సినిమా విడుదలైన తర్వాతే స్పష్టమవుతుంది. ప్రియదర్శి గతంలో 'బలగం', 'కోర్ట్' వంటి చిత్రాలతో నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. హాస్యంతో పాటు భావోద్వేగభరితమైన పాత్రలను కూడా సమర్థంగా పోషించగలరని నిరూపించారు. అందుకే ఆయన కొత్త సినిమా ఎంపికలపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. 'ఇడుపు కాయితం'తో మరోసారి భిన్నమైన పాత్రలో కనిపించనున్నారనే అంచనాలు ఉన్నాయి.

## ఓటీటీలోకి ఆది సాయి కుమార్ 'ఎస్ఐ యుగంధర్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



టాలీవుడ్ నటుడు ఆది సాయి కుమార్ ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'ఎస్ఐ యుగంధర్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమా డిజిటల్ వేదికపైకి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు తాజాగా అప్‌డేట్ అందింది. క్రైమ్, ఇన్వెస్టిగేషన్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆది పోలీసు అధికారిగా కనిపించి ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. నేరాల వెనుక ఉన్న రహస్యాలను ఛేదించే పోలీసు అధికారి చుట్టూ కథ తిరుగుతుంది. అనుమానాస్పద ఘటనలు, విచారణ, ఊహించని మలుపులతో కథను ఉత్కంఠభరితంగా నడిపించినట్లు చిత్రబృందం తెలిపింది. ఓటీటీలో క్రైమ్ థ్రిల్లర్లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ సినిమా డిజిటల్ విడుదలపై ఆసక్తి నెలకొంది. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఇంటి వద్ద నుంచే సినిమాను వీక్షించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఆది సాయి కుమార్ గతంలో విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాల్లో నటిస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. ఈసారి పోలీసు పాత్రలో కనిపించడం ద్వారా మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నించారు. 'ఎస్ఐ యుగంధర్' ఓటీటీ విడుదలతో సినిమాకు మరింత మంది ప్రేక్షకులు చేరువయ్యే అవకాశం ఉంది. అయితే స్ట్రీమింగ్ తేదీ, ప్రసార వేదికకు సంబంధించిన వివరాలను సంబంధిత ఓటీటీ సంస్థ అధికారికంగా ప్రకటించిన సమాచారంతో నిర్ధారించుకోవాలి. డిజిటల్ విడుదల తర్వాత ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుందో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com